honeybee.org
Vol-9 Issue-2

సంపుటి 9 సంచిక 2 జనవరి - ఫిబ్రవరి 2021

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక











# సమృద్ధి సూత్రం

ఒకసారి ఒక వ్యక్తి ఎడారిలో ప్రయాణిస్తూ తప్పిపోయాడు. అతనివద్దనున్న నీటి ఫ్లాస్కులోని నీరు రెండు రోజుల క్రితమే అయిపోయింది. అతని ఓపిక చివరి దశకు వచ్చింది. తిండి సంగతి అటుంచి, వెంటనే నీరు త్రాగకపోతే ప్రాణం పోయే పరిస్థితి. ఈ దశలో కొద్ది దూరంలో అతనికి ఒక గుడిసె కనిపించింది. అది ఎండమావా లేక తాను భ్రమ పడుతున్నానా అనుకుంటునే ఇక వేరే మార్గం లేక ఆ గుడిసె వైపు నిదానంగా అడుగులు వేశాడు. కొద్దిగా దగ్గరికి వెళ్ళిన తర్వాత తెలిసింది అది నిజంగా గుడిశే అని. తనలో వున్న శక్తినంతా కూడగట్టుకొని గుడిసెలోకి ప్రవేశించాడు.

గుడిసెలో ఎవ్వరూ లేరు. చాలా కాలంగా ఎవరూ నివసిస్తున్నట్టూ లేదు. ఏమాత్రం నమ్మకం లేకపోయినా ఏ మూలనైనా కొద్దిగా తాగడానికి నీళ్ళు దొరుకుతాయేమోనని వెతికాడు. అకస్మాత్తుగా ఆ గుడిసెలో ఒక ప్రక్కగా చేతితో పనిచేసే బోరింగు పంపు కనిపించింది. దాని గొట్టం భూమి లోపలికి పాతాళంలో నీళ్ళు వెతకడానికా అన్నట్లు వుంది.

చాలా ఆత్రంగా లేని ఓపిక తెచ్చుకొని పంపు కొట్టడం ప్రారంభించాడు. ఎంత కొట్టినా నీళ్ళు రాలేదు. అయినా ఆత్రంగా చుక్క నీటి కోసం లేని శక్తి తెచ్చుకొని పంపు కొట్టడం కొనసాగించాడు. చివరికి శక్తి ఉడిగిపోయింది. చుక్క నీరు రాలేదు. నిస్ప్రాణతతో, నిష్పృహతో చేతులు పైకెత్తి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. తాను చనిపోయే సమయం ఆసన్నమైందని నిర్ధారించుకున్నాడు.

ఆ పరిస్థితుల్లో గుడిసెలో ఒక మూలన ఒక సీసాలో నీళ్ళు, అవి ఆవిరి ఐపోకుండా పైన మూతన పెట్టి వున్నాయి. అతను చాలా ఆశగా ఆ సీసా మూత తెరిచి ఆత్రంగా గుక్కెడు నీళ్ళు తాగబోయాడు. అప్పుడతనికి సీసాకి అంటించిన ఒక కాగితం కనిపించింది. దానిపై "ఈ సీసాలోని నీరు ఉపయోగించి పంపుని పని చేయించండి. మీ పని అయిపోయిన తర్వాత మళ్ళీ సీసాలో నీళ్ళు నింపి పెట్టడం మర్చిపోకండి"అని వ్రాసిపెట్టబడి వుంది.

అతను సందిగ్దంలో పడ్డాడు. అతని ముందు రెండు మార్గాలున్నాయి. సీసాలో నీళ్ళు ఉపయోగించి, పంపు పనిచేసేలా చెయ్యవచ్చు లేదా చేతితో వ్రాసిన సూచనను పట్టించుకోకుండా సీసాలోని నీరు త్రాగి వెళ్ళిపోవచ్చు. పైగా ఉన్న నీటిని పంపులో పోస్తే అందులోనుంచి నీళ్ళు ఖచ్చితంగా వస్తాయని ఎలా తెలుస్తుంది?, నీళ్ళు పోసిన తర్వాత పంపు పని చెయ్యకపోతే, పైపుకి కన్నం వుండి నీరు ఎక్కడో కారిపోతే, పైపుకి కింద భూమిలో నీళ్ళే లేకపోతే ..... ఇలా అనుమానాలు మనసంతా నిండిపోయాయి.

ఎక్కడో ఒకపక్క మినుకు మినుకు మంటూ ఒక చిన్న ఆశ. కాగితంలో రాసిన సూచన నిజమేనేమో. ధైర్యం చేసి నీళ్ళు పోస్తే నీళ్ళు వస్తాయేమో, ఒకవేళ పోసేసిన తర్వాత నీళ్ళు రాకపోతే ప్రాణం నిలుపుకోవడానికి తనవద్దనున్న చిన్న చివరి అవకాశాన్ని కూడా చేజార్చుకున్నట్లు అవుతుంది. చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు. గుండె నిబ్బరం చేసుకొని, తనవద్దనున్న సీసలోని నీళ్ళు పంపులోకి పోసేశాడు. ఒక్కసారి దేవున్ని ప్రార్థించి పంపు కొట్టడం మొదలు పెట్టాడు. కొద్దిసేపు ఏమీ కాలేదు. అతను పిచ్చి పట్టినట్లు పంపు కొడుతునే వున్నాడు.

అంతే ఒక్కసారిగా పంపులోనుంచి నీళ్ళు వస్తున్న శబ్దం వినిపించింది. వెంటనే నీరు ధారగా బైటకు వచ్చింది. అతని అవసరానికన్నా ఎన్నోరెట్ల నీరు వచ్చింది. ఇక తను జీవిస్తాను అని తెలిసిన తర్వాత ఆ చల్లని నీరు ఇంకా ఆనందాన్నిచ్చింది. కళ్ళలోంచి ఆనంద భాష్పాలు రాలుస్తూ చల్లని నీటితో ముఖం కడుక్కొని సేద తీరి, తనివితీరా నీరు త్రాగిన తర్వాత పోయిన ఓపిక వచ్చి గుడిసె లోపల కలియ తిరిగాడు. అతనికి ఒక పక్కన ఒక పెన్సిలు, ఆ ప్రాంతపు చిత్రపటం కనిపించాయి. ఆ పటంలో తన గమ్యం ఇంకా చాలా దూరమని తెలుపుతోంది. కాకపోతే ఎంత దూరము, ఏ దిశగా వెళ్ళాలని ఖచ్చితంగా తెలిసింది.

ముందు ప్రయాణానికి కావలసిన నీరు తన ఫ్లాస్కులో నింపుకున్నాడు. అ సీసాలో కూడా పూర్తిగా నీరు నింపి, మూత పెట్టి ఇంతకు ముందు వ్రాసివున్న సూచన క్రింద "నన్ను నమ్మండి, ఇది పని చేస్తుంది" అని మనస్ఫూర్తిగా వ్రాశాడు.

ఈ చిన్న కథ మన జీవితం గురించి చెబుతుంది. మనం సమృద్ధిగా ఏదైనా కావాలి అని కోరుకుంటే దానికి ముందు మనస్ఫూర్తిగా ఎంత కష్ట పడాలి?, ఏమేమి ఇవ్వాలి? అని తెలుసుకోవాలని చెపుతుంది. అన్నిటికన్నా ముఖ్యం ఏదన్నా ఇవ్వటంలో దాన్ని ఎంత నమ్మకంగా ఇవ్వాలో నేర్పుతుంది. ఆ మనిషికి తాను చేస్తున్న పని ఫలితాన్ని ఇస్తుందో లేదో తెలియక పోయినా, కార్యోన్ముఖుడయ్యాడు. ఫలితం తెలియక పోయినా నమ్మకంతో ముందుకు వెళ్ళాడు. ఈ కథలో నీరు అన్నది జీవితంలో మనకు జరిగే మంచి.

**జీవితం సుఖవంతంగా నడవటానికి నీదగ్గర తక్కువగా వున్నా, కొంత నీరు ఇవ్వండి. ఫలితంగా అది మనకి ఎన్నో రెట్లు అధికంగా తిరిగి ఇస్తుంది. ఈ నమ్మకంతోనే 2021కి స్వాగతం చెబుదాం.**

Vol-9, Issue - 2 January - February 2021

# విషయ సూచిక



వినూత్న 'మినీ రైస్‌మిల్' తయారు చేసిన వినయభూషణ్ రెడ్డి 4


10వ ద్వైవార్షిక పోటీ విజేతలు 8



సాంప్రదాయ పోషక పదార్థాలకు కొత్త రూపు ఇచ్చిన తోకల శ్రీదేవి 13

మీ సమస్యకు - పల్లెసజన పరిష్కారం 15

జాతీయ బహుమతి పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు 18



నిర్వహణా ఖర్చులేని మహిపాల్ చారి ట్రాక్టర్‌కి అనుసంధాన చేసే 'క్రేన్' 21

2020 లో 'పల్లెసృజన' కార్యక్రమాల్లో కొన్ని విశేషాలు 25


అంతర్జాతీయ బహుమతి పొందిన ఇద్దరు 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు 28


శ్రీతైలం తో మరిన్ని ఉపయోగాలు 29

ఆయుర్వేద జ్ఞాన మథనం- పుదీన, తాటి ముంజల్లో ఔషధ గుణాలు 30


<u>కవర్ లోపలి పేజీల్లో ...</u>

సమృద్ధి సూత్రం - హనీబీ కథ

అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

<u>మధ్య పేజీలో :</u>

నవంబర్ - డిశంబర్ మాసాల్లో 'పల్లెసృజన' కార్యక్రమాలు


# పల్లెసృజన

సంపుటి-9 సంచిక - 2 జనవరి - ఫిబ్రవరి 2021

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/- for 5 years Subscription**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# కరోనా మనకు జీవన పాఠాలు నేర్పిందా

ప్రపంచాన్ని వణికించిన 2020వ సంవత్సరం ముగిసి 2021 నూతన సంవత్సరం ప్రపంచ ప్రజల మనసుల్లో కరోనా సృష్టించిన భయాన్ని చాలావరకు తగ్గించింది. వాక్సిన్‌ల ప్రవేశం, ఆరోగ్య వ్యవస్థల్లో పని చేస్తున్న సిబ్బందికి ప్రథమంగా వ్యాక్సిన్లను వేయడం, స్కూళ్ళు తెరవడం, కాలేజీల్లో త్వరలోనే సామాన్య బోధన చేపట్టడం, మాల్స్, సినిమా హాల్స్ మామూలు స్థాయిలో పని చెయ్యడం, ఎలక్షన్లు కరోనా నిజంగానే వచ్చిందా అన్న రీతిలో మామూలుగా జరగడం, క్రికెట్ మాచ్‌లు, మారథాన్‌లు, సభలు, సమావేశాలు తిరిగి జనావళి జీవితంలో మామూలుగా జరగడం శుభ సూచకాలే అయినా "తస్మాత్ జాగ్రత్త" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ మనందరికి గుర్తు చేస్తూ కనీస జాగ్రత్తలు అంతా పాటిస్తూనే ఉండాలని పదేపదే కోరుతున్నది. కరోనాతో నిండిన 2020 ఒక వింత అనుభవం. ఏం చేయాలో, ఏం చేయకూడదో సమస్త మానవాళికి విచిత్రంగా నిర్దేశించిన కరోనా భయాలు, మానవాళికి ఏమైనా సంకేతాలు ఇచ్చాయా? ప్రభుత్వాలు, పాలసీలు, విద్యార్థులు, మహిళలు, కార్పోరేట్లు, వలస జీవులు, గ్రామ ప్రజలు, పట్టణ వాసులు, వైద్యులు, ఇంజనీర్లు.... వీరంతా ఏం నేర్చుకున్నారు? "అంతా మామూలే" అని తిరిగి పాత ప్రపంచంలోకి వెళ్ళిపోదామా? లేక కరోనా అనుభవాలతో ఒక క్రొత్త జీవన విధానాన్ని, పరిపాలనా దిశను, ఆర్థిక వ్యవస్థను, విద్యా విధానాలను, ఆరోగ్య అవగాహనను, వనరుల వినియోగాలను, మానవత్వ వాదనలను, సమానత్వానికై ప్రయాసలను.... ఇవన్నీ మార్పులు చేసుకుని ఒక నూతన దిశగా ప్రపంచ స్థాయిలో, జాతీయ స్థాయిలో అంచలంచలుగా గ్రామ స్థాయి వరకు జీవ స్రవంతిని కొనసాగిద్దామా? అసలు తిరిగి పాత పద్ధతిలోకి నిజంగా వెళ్ళగలమా? 2020లో ప్రపంచం పాటించిన జీవన సరళిని ముందుకు తీసుకు వెళ్ళడం తప్ప మరో దారి లేదా?

గ్రామ స్థాయిలో ఈ చర్చను సాగిస్తే మనకు అర్థమయ్యేవి మూడు ప్రధాన అంశాలు. "సమానత్వం, ఆత్మ నిర్భరత, ప్రకృతితో మమేకం".

కరోనా సమయంలో సమానత్వం గ్రామాల్లో కనిపించింది. సమానత్వ దృష్టితో గ్రామ ప్రజలు అందిరిని అందరూ కాపాడుకున్నారు. కనీస అవసరాలన్ని ఊర్లలో అందరికీ చేరేలా గ్రామ ప్రజలు పాటుపడ్డారు. నీరు, ఆహారం, మందులు, వైద్య సహాయం, రవాణా, పని ఇవన్నీ తమ గ్రామాల్లో అందరూ భాగస్వాములుగా సాధించుకున్నారు. ఆరు నెలల వరకు గ్రామ ప్రజలు తమను తాము పూర్తిగా కాపాడుకున్నారు. సమానత్వం వచ్చినట్టుగానే అనిపించింది. మానసిక సమానత్వం పూర్తిగా సాధించబడింది. ఆర్థిక సమానత్వంలో కనీస అవసరాలకు ఎవరికి కొదవ లేకుండా చూడబడింది. సామాజిక సమానత్వం కొంత వరకు గ్రామ ప్రజలు అనుభవించారా అన్నది వివదాంశం కాదు. ఇదంతా ఎలా సాధ్యమైంది? ఒక్కసారిగా గ్రామమంతా అభద్రతను ఎదుర్కొనడానికి ఏకమయ్యారు. ప్రజల భావాలు మారాయి, సమానత్వం రావాలంటే ప్రజల్లో భావ విప్లవం రావాలని తాత్వికుడు రావిపూడి వెంకటాద్రి వక్కాణిస్తాడు. మా ఉద్దేశ్యం నిజమైన ప్రజాస్వామ్యం ఈ సమయంలో విరాజిల్లింది. ప్రజలు తమకు కావలసింది నిర్ణయించారు. అభద్రతలో వచ్చిన చెతన్యం వారిని కార్యోన్ముఖులుగా మార్చింది. ఫలితాలు అద్భుతంగా ఉన్నాయన్నది అందరికీ తెలుసు. ప్రజల్లో స్వచ్ఛందంగా వచ్చిన భావ విప్లవం సమాజంలో సమానత్వానికి ఈ కరోనా సమయంలో దారితీసిందని మా విశ్వాసం.



గ్రామాలు సమృద్ధిగా ఉంటాయని, వాటి ఆత్మ నిర్భరతను కాపాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని గాంధీజీ పదేపదే స్పష్టంగా చెప్పేవారు. గత 70 సంవత్సరాల్లో ప్రభుత్వాలు, పాలసీలు, అభివృద్ధి ప్రణాళికలు గాంధీజీ ఉపదేశాన్ని నిర్లక్ష్యం చేశాయన్నది నిజం. అయినా కరోనా కాలంలో దేశంలోని ఆరున్నర లక్షల గ్రామాలు కని విని ఎరుగని ఆత్మ విశ్వాసంతో ఆత్మ నిర్భరతతో బయటి సహాయం లేకుండా కరోనా వల్ల మరణాలు లేకుండా ఎంతో ఉత్తమంగా మెదిలాయి. ఈ అద్భుతమైన నిస్త్రాణంగా వున్న గ్రామ శక్తిని మనం గుర్తించకుండా ఎలా ఉండగలం. గ్రామ ప్రజల ఈ అంతర్ శక్తిని మనం ఇంతవరకు గుర్తించలేక పోయాం. వారు ప్రతి గ్రహం (చేయి చాపడం) తప్ప, తమంత తాముగా మనలేరన్న అహంకార పూరిత భావం చదువుకున్న సమాజం ఇన్నాళ్ళుగా స్థిరపరుస్తూ వచ్చింది. ఎంత పొరపాటు పడ్డాం. ఆత్మ నిర్భరత గ్రామ ప్రజల అసలు శక్తి అని వ్యవస్థకు తెలియదు కాని ఆ శక్తి వారిని కరోనా సమయంలో సమర్థులుగా చేసింది. ఊరి చుట్టూ రాకపోకలపై ఆంక్షలు పెట్టి, ఎంతో విశ్వాసంతో ఏకమై మన గ్రామాలు తమను కాపాడుకున్నాయి. నిష్పక్షపాతంగా ఒక్క నిమిషం ఆలోచించి చూడండి. రెండు మూడు నెలల 'లాక్‌డౌన్'లో నిజంగా గ్రామాలకు వ్యవస్థ చేసిందేమిటి? కరోనా రావటం ఒక విధంగా మన గ్రామాల్లోని అసలైన దాగున్న ఆత్మ విశ్వాసాన్ని పైకి తెచ్చి ఆత్మ నిర్భరత దిశగా వారిని సమర్థవంతంగా నడిపించింది. ఎంత ఉత్కృష్టమైన శక్తి. ఆనంద భరిత పరిణామం ఐకమత్య ధోరణి ఇవన్నీ మనం భవిష్యత్తులో గ్రామాలలో ఉండాలని కోరుకుందామా లేక పాత 'ఆధారిత జీవన' పద్ధతిని కొనసాగిద్దామా? ఈ చర్చ అతి ప్రధానం.

# సంపాదకీయం

గ్రామాలను భగవంతుడు నిర్మిస్తే పట్టణాలను మనుష్యులు నిర్మించారనడంలో అతిశయోక్తి లేదు. ప్రకృతిలో ఒక చిన్న భాగంగా గ్రామాల్లో మనుషులు మెలగుతారు. ప్రకృతితో మమేకమై దాని ఆధారంగా మనుగడ సాగిస్తారు. ప్రకృతిలోని పునర్జీవన తత్వాన్ని సంపూర్తిగా వాడుకుంటారు. వారి అవసరాలను తీర్చుకుంటూ కొరతలేని జీవనం సాగిస్తారు. గాంధీ గారు చెప్పినట్లుగా తక్కువలో ఎక్కువ ఉత్పత్తి చాలా మందికి ఉపయోగంగా ఉండేలా తమ జీవన ఉత్పత్తి మార్గాలను మార్చుకుంటారు. ఆ అద్భుత శక్తి కరోనా సమయంలో గ్రామ ప్రజలను, నగరాలను పట్టణాలను దేశాలను సంరక్షించింది. జూన్ 2020లో లాక్‌డౌన్ పూర్తిగా అమలులో ఉండింది. అప్పుడే వ్యవసాయ పనులు ఆరంభం. ఊరంతా దిగ్బంధం. ప్రకృతి తన పని చేసుకుంటూ పోతుంది. చెట్లు పెరిగాయి, పశువులు, పాలు, పండ్లు, పూలు గ్రామ ప్రజలకు లాభించాయి. వర్షాలు పడి వ్యవసాయానికి అనుకూలత ఏర్పడింది. ప్రకృతి కరోనా సమయంలో దిగ్బంధం కాలేదు. తనపని తాను చేసుకుంటూ "ప్రకృతి కాలెండర్" ప్రకారం ముందుకు పోయింది. గ్రామ ప్రజలు ప్రకృతితో మమేకమై కరోనా సమయంలో కూడా వారి జీవన విధానాలను కొనసాగించారు. భూములు దున్నారు, పంటలు వేసారు, సేద్యం చేశారు, పురుగులను చంపారు, పంటను పెంచుకున్నారు, కోసుకున్నారు, పండ్లు కూరగాయలు, పూల తోటలను పెంచారు, వారి పనులు ఆపలేదు. ఏ సహాయం లేకుండా అన్ని పనులు సక్రమంగా చేసుకున్నారు. తాము పండించిన పంటను సమాజంతో పంచుకున్నారు. ఈ భయంకర కరోనా సమయంలో రైతులు గ్రామస్తులు తమ విధులను పూర్తిగా స్వాతంత్ర్యంతో ఏ సహాయాన్ని ఆశించకు,డా ఎవరిపైనా ఆధార పడకుండా ప్రకృతికి కృతజ్ఞతతో దేశ ప్రజలకు విధి తప్పకుండా ఆహారాన్ని పండించారు, అందించారు.

ఈ సందర్భంలో ఆధునిక ప్రపంచం నిర్వీర్యమైంది. ఫ్యాక్టరీలు మూత పడ్డాయి, రవాణా సౌకర్యం ఆగిపోయింది, విద్యాసంస్థలు ఖాళీ అయ్యాయి, ప్రభుత్వ అంతంత మాత్రమే పని చేసింది. ఇక్కడ ఉత్పత్తి శూన్యమైతే గ్రామాల్లో జీవన విధానం వారి కార్యక్రమాలు ఆగలేదు. ఇలాంటి అద్భుత వర్గానికి మనం కృతజ్ఞులమై ఉండాలి. వారు పంటలు మనకు సరఫరా చేయకపోతే 2021లో దేశమంతా అల్లకల్లోలమయ్యేది. వారికి శిరస్సు వంచి నమస్కారం చేయాలని ప్రధానమంత్రికి తోచకపోవడం ప్రభుత్వ ప్రాధాన్యతని ప్రకటిస్తుంది. శోచనీయం కూడా.

రైతు ఆత్మహత్య చేసుకున్నాడంటే నైతికంగా దేశం ఆత్మహత్య చేసుకున్నట్లు అన్నారు డా. వుంజాల వినయ కుమార్ సమ సమాజాన్ని నిర్మాంచాలంటే మానవ వాదం ప్రజలంతా అవలంభించాలి భావ విప్లవాలు ఈ దిశలో సమాజమంతా రావాలి. మనిషిని మనిషిగా గౌరవించినప్పుడే అసమానతలు అంతమయ్యే అవకాశముంది. కరోనా తెచ్చిన విపత్తునుండి మన గ్రామాలు ఏవిధంగా మనగల్గాయో, తమను తాము కాపాడుకున్నాయో, సమానత్వాన్ని, ఆత్మ నిర్భరతను, ప్రకృతి పునరుత్పత్తిని ఎలా అమలు పరిచాయో క్షుణ్ణంగా అధ్యయనం చేసి కరోనా (ప్రకృతి) నేర్పిన పాఠాలను అధ్యయనం చేసి భవిష్యత్తులో అభివృద్ధి దిశనూ, మానవ కళ్యాణార్థంగా సరిచేయాలి. అన్ని స్థాయిల్లో ఈ దశలో పరిశోధనలు, విద విధానాలు త్వరలోనే జరిపి ప్రభుత్వ పాలసీలను గ్రామీణ ఆత్మ నిర్భరత లక్ష్యంగా మార్చే ప్రయత్నం వెంటనే జరగాలి.

'పల్లెసృజన' వాలంటీర్లు 2020లో వేయికి పైగా విద్యార్థులతో 'రూరల్ ఇంటర్న్‌షిప్' ఆన్‌లైన్‌లో ప్రభావ వంతంగా చేశారు. డిశంబరులో మహబూబాబాద్ జిల్లాలో 35వ చిన్న శోధయాత్ర జరిగింది. ప్రతి బుధవారం గత అక్టోబర్ మాసం నుండి వెబినార్ ద్వారా రైతులు పరిష్కరించిన రైతు సమస్యల గురించి చర్చించుకున్నారు. నాలుగు రైతు సదస్సులు ప్రత్యక్షంగా పల్లెసృజన ఇన్నోవేషన్ విస్తృత కేంద్రంలో నిర్వహించారు. ఇది ప్రతి నెలా మొదటి మరియు మూడు శనివారాల్లో జరుగుతునే ఉంటుంది. ఎఫ్.పి.ఓ.లకు, మహిళా రైతులకు ఇన్నోవేషన్ల అవగాహన సదస్సులను ప్రత్యేకంగా పల్లెసృజన ఆవరణలో నిర్వహిస్తున్నారు. వందలకొద్ది రైతులు, వలస గ్రామవాసులు, గ్రామాల్లోని వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగులు వీరందరితో సంభాషణలు, చర్చలు, ల్లెసృజనకు కరోనా సమయంలో గ్రామాల గురించి ఎంతో జ్ఞానాన్ని నిజాలను తెలియజేసింది. ఆ భావ సేకరణ, వాటి విశ్లేషణలో ఉద్భవించిన గ్రామ సామర్థ్యాలు పల్లెసృజనకు పై విధంగా ఆలోచించడానికి ప్రేరేపించాయి.

అర్హులైన రైతులకు, గ్రామాలకు పూర్తి గౌరవాన్ని, విలువను, బాధ్యతాపూర్వక కృతజ్ఞతను మనం రోజూ వారికి ప్రకటించాలి. మన కుటుంబ సభ్యులకు నేర్పాలి. యువకులకు, పిల్లలకు మానవత్వ విధానాన్ని సమానత్వ విశిష్ఠతను తెలియజెప్పాలి. భావ విప్లవానికి మానవతా వాదాన్ని అగ్నికి ఆజ్యంలా తోడు చేయాలి. మనం అభ్యాసం చేయాలి. వ్యవస్థను కరోనా నేర్పిన పాఠాలతో ప్రక్షాళన చేసి విధి విధానాలను మన సంవిధానంలోని సమానత్వం సాధించడానికి పూర్తిగా వాడుకోవాలి. సరిగ్గా నిర్వచించాలి.

కరోనా ఒక భయంకర శాపం అయినా, ఒక రకంగా అది నేర్పిన పాఠాలను అనుభవాలను కూలంకషంగా అర్థం చేసుకొని అమలు పరిస్తే అది మానవాళికి ఒక వరమే అవుతుందేమో..

**భవదీయ**

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)




# వినూత్న 'మినీ రైస్‌మిల్' తయారు చేసిన వినయభూషణ్ రెడ్డి

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గాదె సాంబిరెడ్డి కుమారుడు 'గాదె వినయ్‌భూషణ్ రెడ్డి' చదివింది కేవలం 7వ తరగతి వరకు మాత్రమే. చిన్నతనం నుండి తండ్రితో పాటు పొలం పనులు చేస్తుండేవాడు. తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. చిన్నప్పటి నుండి వినయ్ కు పట్టుదల ఎక్కువ. తాను ఏదైనా అనుకుంటే దాన్ని సాధించే వరకు నిద్రపోని మనస్తత్వం. మామూలుగా యంత్రాలంటే ఇష్టం వున్న వినయ్ తనకు నచ్చిన యంత్రం కనిపిస్తే మాత్రం దాని పూర్వా పరాలను చాలా నిశితంగా గమనిస్తాడు.

మూడు సంవత్సరాల క్రితం వ్యవసాయంలో బాగా నష్టాలు వచ్చి అప్పులు కావడంతో తన పొలంలోని ఒక ఎకరా పొలాన్ని అమ్మి, అప్పులన్నీ తీర్చాడు. వ్యవసాయంలో బాగా నష్టాలు వస్తున్నాయి, వ్యవసాయంతో పాటు ఏదైనా జీవనోపాధి చూసుకుంటే బావుంటుందని ఆలోచించాడు. వినయ్‌కి వ్యవసాయం తప్ప ఇతర విషయాలు పెద్దగా తెలియవు కాబట్టి ఇందులోనే ఏదైనా ఆదాయం వచ్చే పని చేస్తే బావుంటుందని ఆలోచించాడు. తన ప్రాంతంలో ఎక్కువగా పండే పంట వరి. వరి పండించిన తర్వాత చాలామంది రైతులు ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయిస్తారు, కొద్దిమంది రైతులు తామే స్వయంగా ధాన్యాన్ని మిల్లు ఆడించుకుని, బియ్యాన్ని అమ్ముకునేవారు. ఇలా వినయ్ కూడా తను పండించిన ధాన్యాన్ని నేరుగా మార్కెట్‌లో అమ్ముకోకుండా, మిల్లు పట్టించి బియ్యాన్ని విక్రయించి కొద్దిగా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేవాడు.

బియ్యం మిల్లులో మర ఆడిస్తే 76 కిలోల ధాన్యానికి 55 కిలోల బియ్యం మాత్రమే వచ్చేవి. పైగా ప్రతి రైతు అందునా చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి ధాన్యాన్ని మిల్లుకు తీసుకుపోలేక పోతున్నారని గ్రహించాడు వినయ్. తాను ఒక మొబైల్ రైస్‌మిల్లు ఏర్పాటు చేసుకుంటే తనలాంటి చిన్న రైతుల ధాన్యాన్ని వారి ఇంటివద్దకే వెళ్ళి మర ఆడించ గలిగితే బావుంటుందని ఆలోచించాడు. తాను పొలం అమ్ముకుని, అప్పులు పోగా మిగిలిన డబ్బుతో ఉత్తర ప్రదేశ్‌లో ఇలాంటి మొబైల్ రైస్‌మిల్లు తయారు చేస్తున్నారు అని తెలుసుకుని అక్కడికి వెళ్ళి ఒక మొబైల్ రైస్ మిల్లు కొనుగోలు చేసుకుని వచ్చి తన వ్యాపారాన్ని మొదలు పెట్టాడు. మూడు నాలుగు మాసాల అనుభవంతో రైస్‌మిల్లులో వివిధ భాగాలు

ఎలా పని చేస్తాయో, వాటి పూర్వాపరాలు పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. ఇలా తన వ్యాపారం సాగుతున్న సమయంలో కొందరు రైతులు చిరు ధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు లాంటివి కూడా ఆడించ గలిగితే బావుటుంది కదా అని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

ప్రస్తుతం రైస్ మిల్లులో ధాన్యం మెరికల రూపంలో వృధాగా పోవటం వల్ల రైతుకు నష్టం కలుగుతోంది అని ఎందుకిలా జరుగుతుందో ఆలోచించాడు. మిల్లులో మరికొన్ని అదనపు చక్రాలను ఏర్పాటు చేయటం ద్వారా ఈ వృధా పోవడం సమస్యను నివారించవచ్చు అని తెలుసుకుని తానే స్వయంగా ఒక చిన్న మిల్లును తయారు చేశాడు. సాధారణంగా మిల్లులో బస్తాకు 55 కిలోల బియ్యం వచ్చే స్థితి నుండి తను తయారు చేసిన మిల్లులో 65 కిలోల వరకు బియ్యం వచ్చాయి. తన యంత్రం విజయవంతం కావటంతో ఆ యంత్రాన్ని బాపట్ల వ్యవసాయ కళాశాల వారికి అందజేశాడు. ఆ తర్వాత కృష్ణా జిల్లా నందిగామ సమీపంలోని చెరుకుం పాలెం గ్రామానికి మరో యంత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు. తాను తయారు చేసిన యంత్రంలో అండుకొర్రలు 50-60 కిలోల వరకు బియ్యం, కొర్రలు అయితే 70 కిలోల వరకు బియ్యం వస్తున్నాయి. ఊదలు, సామలు, అరికలు కూడా 50 కిలోలకు పైగా వస్తున్నాయి. ఈ బియ్యం కూడా కేవలం పై పొట్టు మాత్రమే తీసివేసి ముడి బియ్యంలా వస్తాయి. బాపట్ల ప్రాంతం నుంచి వినయ్ వద్దకు నల్లబియ్యం, బాస్మతి బియ్యం పట్టించుకోవటానికి కూడా వచ్చేవారు. వాటిని కూడా తాను ట్రాక్టర్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసుకున్న మొబైల్ రైస్ మిల్లులోనే ఆడించి ఇస్తుండేవాడు. అలా బియ్యం పట్టించుకోవడానికి ఎక్కడెక్కడి నుండో వచ్చే రైతులు తమకు కూడా ఇంత పెద్దగా కాకుండా, మొబైల్ రైస్‌మిల్లు కరెంటుతో పని చేసేలా తయారు చేసి ఇవ్వమని కోరటం జరిగింది.

వారి కోరిక మేరకు మళ్ళీ తన రైస్ మిల్లును బాగా గమనించి, అందులోని కొన్ని పరికరాలు బైట నుండి తీసుకుంటే ఖరీదు ఎక్కువ అవుతుంది, వాటిని తానే తయారు చేస్తే తక్కువ ఖర్చులో యంత్రం తయారు అవుతుంది అని అనుకున్నాడు. మిషన్ అంతా తయారు చేసిన తర్వాత వడ్లు మర ఆడించేటపుడు కొన్ని వడ్లు మెరికలుగా రావటం గమనించి వాటిని వేరు చేయటానికి ఆ యంత్రానికి ఒక 'సపరేటర్'ను తయారు చేశాడు. ఈ సపరేటర్ ఎలా వుంటుంది అంటే మనుషులు 'చాట'తో బియ్యాన్ని చెరిగి మెరికలను వేరు చేసే విషయాన్ని దృష్టిలో వుంచుకుని మిషన్‌కే ఒక చాటలా పనిచేసే సపరేటర్‌ను ఏర్పాటు చేశాడు. రైస్ మిల్లు ఏర్పాటు చేసుకోవాలంటే ఎక్కువ స్థలం అవసరం అవుతుంది. కానీ వినయ్ తయారు చేసిన మినీ రైస్‌మిల్లు కేవలం 12-12 అడుగుల ఒక చిన్న గదిలో ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో ముడి బియ్యం, మెరికలుగా వచ్చే వడ్లు ప్రత్యేకంగా వచ్చేలా ఏర్పాటు చేశాడు. అంటే ఈ మిల్లులో ధాన్యాన్ని ఆడిస్తే వచ్చే బియ్యంలో మెరికలు అస్సలు ఉండవు అన్నమాట. ఈ యంత్రం కొన్నవారికి మరో లాభం ఏమిటంటే, ఇందులో వరి ధాన్యంతో పాటు చిరు ధాన్యాలైన కొర్రలు, అండుకొర్ర, సామలు, బరిగలు అన్నీ ఒకే యంత్రంలో మర ఆడించి బియ్యంగా మార్చుకోవచ్చు. ఈ రైస్ మిల్లులో ముందటి రైతు పట్టించిన బియ్యం మీ బియ్యంలో కలవదు. పెద్ద మిల్లుల్లో ఈ ఇబ్బంది ఉంటుంది.

వినయ్ తయారు చేసిన మినీ రైస్ మిల్లులో 'చాట' ను అమర్చడం ఇతని ప్రత్యేకత. దీని ద్వారా బియ్యం, మెరికలు వేరు చేయబడి నాణ్యమైన బియ్యం బయటకు వచ్చేలా ఏర్పాటు చేశాడు. ఈ చాటను తయారు చేయటంలోనే ఇతని సృజనాత్మకత అంతా దాగుంది.

పెద్ద రైస్ మిల్లులలో ఇలాంటి సదుపాయం వుండదు. అవి కేవలం వరి ధాన్యాన్ని మాత్రమే బియ్యంగా మారుస్తాయి. చిరు ధాన్యాలను బియ్యంగా మార్చలేవు. అందుకు వేరే యంత్రం వద్దకు రైతు వెళ్ళాల్సి వుంటుంది. 'తనకు తెలిసినంత వరకు ఇలా అన్నీ ఒకే యంత్రంతో పనిచేసే సదుపాయం





ఎక్కడా లేదు' అంటాడు వినయ్. అంతేకాదు ఈ యంత్రంతో గోధుమలు, రాగుల పైనున్న పొట్టును కూడా తీసివేయవచ్చు అని గర్వంగా చెప్తాడు వినయ్. ఈ యంత్రాలలో సింగిల్ ఫేస్‌తో పని చేసే యంత్రం గంటకు 4 బస్తాల ధాన్యాన్ని ఆడించవచ్చు, త్రీ ఫేస్ యంత్రంలో అయితే గంటకు 8–9 బస్తాల వరకు ధాన్యాన్ని మర ఆడించవచ్చు. సింగిల్ ఫేస్ యంత్రంలో 3 హార్స్‌పవర్‌ల మోటర్ ఒకటి, 1 హెచ్.పి. మోటార్లు రెండు వుంటాయి. మొత్తం యంత్రాన్ని 12 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు వున్న గదిలో ఏర్పాటు చేసుకోవచ్చు.

డ్రిల్లింగ్ వగైరా పనుల కొరకు కొన్ని చిన్నపాటి యంత్రాలను కొనుగోలు చేసుకో గలిగితే ఇంకా ఎన్నో మినీ రైస్ మిల్లులను తయారు చేసి తక్కువ ధరలో అందించ గలను అంటాడు.

వినయ్‌భూషణ్ రెడ్డికి లభించిన అత్యద్భుతమైన తోడు అతని జీవిత భాగస్వామి శ్రీమతి గీతావాణి. ఆమె ఇతనికి అందించిన తోడ్పాటు, సహాయ సహకారాలు, ప్రోద్బలం వల్లనే ఒక సాధారణ వ్యక్తి ఇంతటి అద్భుత యంత్రాన్ని తయారు చేయ గలిగాడు అనటం అతిశయోక్తి కాదు. వినయ్‌భూషణ్ జ్ఞానం మీద ఆమెకు అపారమైన నమ్మకం. ఆయన ఏదైనా చెయ్యాలి అనుకుంటే చాలు నిద్రాహారాలు, పరిసరాలు అన్నీ మరిచి ఖచ్చితంగా విజయం సాధిస్తాడు అని ఎంతో గర్వంగా చెబుతుందామె. 18–20 సంవత్సరాల నుండి ఈమె రైస్‌మిల్లు, కారం మిషన్, పిండిమిషన్‌లు అన్నీ ఆమే నడుపుతూ, తన భర్త సృజనాత్మకతకు ఏమాత్రం అడ్డు రాదు సరికదా, ఇంకా అతనికి కావలసిన సహాయం కూడా అందిస్తూ వుంటుంది. తన భర్తకు యంత్రాలు అంటే ఎంతో ఇష్టం అనీ, కొత్తవాటిని తయారు చేయటం, వున్న వాటికి ఏదైనా రిపేర్లు వస్తే చెయ్యటం అంతా తనే చూసుకుంటాడు అంటుంది గీతావాణి.

తమకున్న కొద్దిపాటి పొలంలో పని చేసుకుంటూ చాలా కష్టాలు పడ్డామని, కొంత పొలం అమ్ముకుని మినీ రైస్ మిల్లు తీసుకు వచ్చాడని, అందులో కొన్ని సంవత్సరాలు కేవలం వరి ధాన్యాన్ని మాత్రమే ఆడించటం జరిగిందని చెప్పారు గీతావాణి. కొన్ని సంవత్సరాల తర్వాత పెద్ద రైస్ మిల్లులను బాగా గమనించి, వారి సలహాలు తీసుకుని, తన ఆలోచనతో ఒకే రైస్ మిల్లులో అన్ని రకాల ధాన్యాన్ని మర ఆడించేలా తయారు చేశాడని అందామె. తాను ఎంతో కష్టపడి, ఆలోచించి తయారు చేసిన మినీ రైస్ మిల్లు వల్ల ఇప్పుడు తమ ఆదాయం బాగా పెరిగిందని, చిన్న చిన్న రైతులు తమ ధాన్యాన్ని తమవద్ద పట్టించుకుని వెళ్తున్నారని, వరి ధాన్యంతో పాటు, చిరు ధాన్యాలు, గోధుమలు, రాగులు కూడా ఆడించటం వల్ల తమ మిల్లుకు ఎంతో ప్రచారం లభించి ప్రస్తుతం తమకు చేతినిండా పని వుందని అంది గీతావాణి. తమ చిన్న మిల్లుకు 'చాట' ఏర్పాటు చేయటం వల్ల ఎలాంటి మెరికలు లేని బియ్యం రావటంతో రైతులు కూడా ఎక్కువగా తమవద్ద ధాన్యాన్ని మిల్లు ఆడించేందుకు వస్తున్నారని, నాణ్యమైన బియ్యం అందించటం తమకెంతో తృప్తిగా వుందని అంటోంది గీతావాణి. ప్రస్తుతం రైతులు స్వయంగా తమ ధాన్యాన్ని బియ్యంగా మార్చుకునేందుకు ఒక చెక్క 'విసుర్రాయి' కి మోటార్ అమర్చే పనిలో వున్నాడు. త్వరలోనే ఇది మార్కెట్ లోకి వస్తుందని దీని ద్వారా రైతులు ఎవరికి వారు బియ్యం తయారు చేసుకోవచ్చని అంటోంది వినయ్ భార్య గీతావాణి.

వినయ్‌భూషణ్ రెడ్డి తయారు చేసిన మినీ రైస్ మిల్లు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకో గలిగితే ఆ గ్రామంలోని వరి ధాన్యంతో పాటు చిరు ధాన్యాలు కూడా మర ఆడించుకుని, మార్కెట్‌లో ధాన్యంగా కాకుండా బియ్యం రూపంలో



విక్రయించుకుంటే రైతులకు అదనపు ఆదాయంతో పాటు ఆ గ్రామంలోని అందరికీ నాణ్యమైన బియ్యం అందించ గలం. ఇలా చేయటం వల్ల ప్రతి గ్రామం ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించి, బియ్యాన్ని తిరిగి కొనుగోలు చేసే పరిస్థితి మారిపోయి, ఏ ఊరి ధాన్యం ఆ ఊళ్లో లభ్యం కావటం వల్ల దేశానికి కూడా కోట్లాది రూపాయల అనవసరపు రవాణా ఖర్చు మిగిలిపోతుంది. గ్రామాల్లో ఆత్మ నిర్భరతకు అవకాశం కలుగుతుంది. ఇక్కడ ఒక్క విషయం అందరూ గమనించాలి. రైతు ధాన్యం రూపంలో విక్రయించటం కన్నా, కొద్ది శ్రమ పడి, ఇంకొంచెం ఖర్చు పెడితే అతనికి దాదాపు రెట్టింపు ఆదాయం వస్తుంది. ముందుగా యంత్రం కొనే ఖర్చే తప్ప, తర్వాత ఖర్చులేవీ వుండవు కనుక కొద్ది కాలంలోనే దానికి కొరకు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చేస్తుంది. గ్రామాలు అభ్యుదయం వైపు వెళ్ళటమే కాకుండా ఆరోగ్యంగా కూడా తయారౌతాయి. ప్రభుత్వాలు రైతు ఆదాయం రెట్టింపు చేయాలని అనేక ప్రయత్నాలు, ప్రయోగాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ప్రమేయమే లేకుండా రైతే తన ఆదాయాన్ని రెట్టింపు చేసుకునే మార్గంగా ఇది కనిపించటం లేదూ! **దాదాపు 3 లక్షలు ఒక్కసారి ఖర్చు పెట్టుకుంటే అతి తక్కువ కాలంలోనే మన పెట్టుబడి తీరిపోవటమే కాక, తరువాత ప్రతి సీజన్‌కి రెండింతల ఆదాయం వస్తుందని గమనించండి.**

పెద్ద రైసు మిల్లుతో పోలిస్తే వినయ్‌భూషణ్ రెడ్డి చేసిన మినీ రైస్‌మిల్లు ఒకే రకమైన పని చేసినా లాభాల్లో చాలా తేడా వుంటుంది అన్న విషయం ఈ క్రింది పట్టిక చూస్తే అర్థమవవుతుంది.

వినయ్ భూషణ్ తన సృజనాత్మకతను పెంపొందించుకుని, మరిన్ని మినీ రైస్ మిల్లులను తయారు చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు, మరియు తగిన ప్రాచుర్యం కల్పించేందుకు 'పల్లెసృజన' సిద్ధంగా వుందని తెలియజేస్తూ, ప్రతి గ్రామస్తులు ఈ మినీ రైస్ మిల్లులు తమ గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తోంది. ●

**ఇన్నోవేటర్ వినయ్ భూషణ్ రెడ్డి,**

**ఫోన్ : 8074765385**

**పెద్ద రైస్ మిల్లుకి వినయ్ తయారు చేసిన మినీ రైస్ మిల్లుకి గల తేడా గమనించండి. రెండు మిషన్లలో వాడే పరికరాలు ఒక్కటే**

| పెద్ద రైస్ మిల్లు వల్ల రైతుకు నష్టాలు | చిన్న రైసు మిల్లు వల్ల రైతన్నకు లాభాలు |
|---|---|
| 1. ఖర్చు – 20 నుండి 25 లక్షలు. | 1. 3 లక్షల లోపు. |
| 2. విస్తీర్ణం – ఎక్కువ స్థలం కావాలి | 2. 12 – 12 అడుగుల గది సరిపోతుంది. |
| 3. కరెంటు – 25 హెచ్.పి. మోటారు కావాలి. | 3. 7.5 హెచ్.పి. మోటారు సరిపోతుంది. |
| 4. దిగుమతి – 76 కిలోల ధాన్యానికి 55 కిలోల ముడి బియ్యం. | 4. 75 కిలోల ధాన్యానికి 60 కిలోల ముడి బియ్యం. |
| 5. గంటకు – 10 బస్తాల ధాన్యం మర ఆడుతుంది. | 5. గంటకు 5–6 బస్తాలు మర వేయవచ్చు. |
| 6. ఒకరి బియ్యంలో మరొకరి బియ్యం కలుస్తాయి. మిల్లులో బియ్యం నిల్వ ఉంటాయి. | 6. ఒకరికి ఒకరివి కలవవు. మిషన్‌లో బియ్యం నిల్వ వుండవు. |
| 7. వడ్లు మాత్రమే పట్టవచ్చు. | 7. వడ్లు మరియు కొర్ర, అండుకొర్ర వంటి చిరు ధాన్యాలు కూడా మర వేయవచ్చు. |
| 8. ఇది రిపేర్‌కి వస్తే మెకానిక్ అవసరం. | 8. ఈ మిషన్ రిపేర్‌ను రైతే స్వయంగా చేసుకోవచ్చు. |
| 9. ఇది పని చేయాలంటే చాలామంది కూలీలు అవసరం. | 9. దీన్ని రైతు ఒక్కడే నడిపించ గలడు. |
| 10. నిర్వహణా ఖర్చు ఎక్కువ – లాభాలు తక్కువ. | 10. నిర్వహణా ఖర్చు చాలా తక్కువ. – లాభాలు ఎక్కువ. |

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

**- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్**

**రాష్ట్ర స్థాయి పురస్కారం - నాగాలాండ్**

**చిన్న జంతువుల ఆపరేషన్ టేబుల్**



పేరు : ఇమ్నా మేరీన్

నివాసి : దిమాపూర్, నాగాలాండ్

51 సంవత్సరాల ఇమ్నా మేరీన్ చాలా కాలం వ్యవసాయంతో పాటు వడ్రంగి పని కూడా 'మకాక్ చింగ్' అనే గ్రామంలో చేసేవాడు. తన ఉపాధి అవకాశాలు పెంచుకోవడం కోసం 2012లో భార్యతో సహా దిమాపూర్ వచ్చేశాడు. తమని తాము పోషించుకోవటం కోసం పందుల పెంపకం చేపట్టారు. ఇమ్నా మేరీన్‌కి స్వతహాగా సమస్యల పరిష్కారం గురించి ఆలోచించడం చేస్తూ వుండేవాడు. ఈ అలవాటు అతనికి ప్రతిదీ నిశితంగా పరిశీలించడం వల్ల అబ్బింది. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈయన తన ఆదాయంలో చాలా భాగం ఖర్చు చేస్తూ ఎక్కువ సమయం ఇతరులతో చర్చించి, తన జ్ఞానం పెంచుకోవటంలో గడిపేవాడు. ఇతను చిన్న జంతువుల శస్త్ర చికిత్స (ఆపరేషన్) చేసే టేబుల్‌తో పాటు పందులలో కృత్రిమ గర్భాధారణ చేయటానికి ఒక నమూనా బొమ్మను తయారు చేశాడు. ఇదే కాక, అతను కర్రపెండలం తరిగే యంత్రం తో పాటు పెండలాన్ని నాటే యంత్రాన్ని కూడా తయారు చేశాడు.

స్థానిక పశు వైద్యశాలలో చిన్న చిన్న జంతువులకి శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చేటపుడు దానికి అనువైన ఆపరేషన్





టేబుల్ లేకపోవటం వలన ఇద్దరు ముగ్గురు వ్యక్తులు జంతువుని కదలకుండా పట్టుకోవాల్సి రావటంతో అసలే జబ్బుతో వున్న జంతువు అరిచి, కంగారు పడి పెనుగులాడటం వలన ఆ జంతువుకి, చికిత్స చేసే వైద్యునికి కూడా చాలా ఇబ్బందిగా వుండేది. అదీ కాక ఆ పశు వైద్యశాల జనావాసాలకి చాలా దూరంగా ఉండటంతో పాటు, అక్కడికి వెళ్ళే మార్గం కూడా గోతులు, రాళ్ళు రప్పలతో నిండి వుండేది. ఈ కారణంగా జబ్బుతో వున్న జంతువుని వైద్యశాలకి తీసుకు వెళ్ళాలంటే చాలా సమయం పట్టేది, శ్రమ కూడా అయ్యేది. తనకే ఈ అనుభవం చాలాసార్లు కావటంతో ఇమ్మా మేరీన్ గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడికైనా తీసుకు వెళ్ళ గలిగి, చిన్న జంతువులకి శస్త్ర చికిత్స చేసే ఆపరేషన్ టేబుల్‌ని తయారు చెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

స్వతహాగా వడ్రంగి కనుక స్థానికంగా లభించే 'సాగ్వాన్' (ఒక రకమైన టేకు చెక్క) తో ఒక ఆపరేషన్ టేబుల్ తయారు చేశాడు. దీనిని కావలసిన చోటుకి తీసుకొని వెళ్ళి చిన్న జంతువులైన కుక్కలు, గొర్రెలు, పందులు లాంటి వాటికి ఇంజక్షన్లు, టీకాలు, శస్త్ర చికిత్సలు మొదలైనవి సులువుగా చేసుకోవచ్చు. దీనికే అవసరం అయినప్పుడు తగిలించుకునే విధంగా శస్త్ర చికిత్స చేసేటపుడు వాడే సెలైన్ బాటిల్ లాంటివి తగిలించుకునే విధంగా ఐ.వి. డ్రిప్ స్టాండ్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ టేబుల్‌కే శస్త్ర చికిత్స చేయటానికి అవసరమైన వస్తువులు పెట్టుకోవటానికి ఒక సొరుగు, శరీరము, కాళ్ళు కదలకుండా బంధించడానికి తగ్గ పట్టీలు, జంతువుకు మెత్తగా వుండటానికి పరుపు, మల మూత్రాలు సులువుగా వెళ్ళిపోయే ఏర్పాటు, అవసరమైనపుడు ఆ టేబుల్‌ను ఎటువైపైనా వంపుకునే హైడ్రాలిక్ పద్ధతి మొదలైన ఎన్నో ఏర్పాట్లు చేయబడి వున్నాయి. 25 కిలోల బరువు వుండే ఈ ఆపరేషన్ టేబుల్ ఖరీదు రూ. 18,000/–లు. ఈయన దీనిని స్థానికంగా అనేక ఊళ్ళల్లో డాక్టర్లకు సరఫరా చేశాడు. దీనిని చూసిన జాతీయ స్థాయి పందుల పరిశోధనా సంస్థ (ఐ.సి.ఎ.ఆర్.) వారు ఎంతో అనువుగా వుందని, పైగా కావలసిన చోటికి తీసుకు వెళ్ళడానికి కూడా అనువుగా వుందని కితాబునిచ్చారు.

ఎన్.ఐ.ఎఫ్. వారు 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాజ జ్ఞాన పోటీలు 2019కి గాను ఇమ్మా మేరీన్‌ను రాష్ట్ర స్థాయి పురస్కారంతో సత్కరించారు.

## రాష్ట్రస్థాయి పురస్కారం - తమిళనాడు

### చేనేతలో సులువుగా 'జాకార్డ్' పెడలింగ్ చేసే పరికరం



పేరు : **పి. రవి**

నివాసి : తిరువన్నామలై, తమిళనాడు

26 సం. తిరున్నామలైకి చెందిన రవి చిన్న తనం నుంచి కూడా ఎలక్ట్రానిక్స్‌పై అభిలాష వుండి, పాత టీవీలు, రికార్డ్ ప్లేయర్‌లు మరమ్మత్తులు చేస్తూ వాటి పని తీరును తెలుసుకుంటూ వుండేవాడు. ఈ క్రమంలో అతను 1999లో బైట బజార్లో దొరికే ఆడియో క్యాసెట్లకన్నా చవకగా ఆడియో క్యాసెట్లు తయారు చేసే పద్ధతి కనుగొని చాలా కాలం ఆ వ్యాపారం చేశాడు. కాలక్రమేణా టెక్నాలజీ మారిపోయి,





ఇతర పరికరాలు రావటంతో ఆడియో క్యాసెట్ల వాడకం తగ్గిపోయి, ఇతని వ్యాపారం మూల పడింది. అటువంటి పరిస్థితుల్లో రవి చేనేత పనివారి సమస్యలకి పరిష్కారం కనుగొనటానికి ఒక యంత్రాన్ని కనుగొనే ప్రయత్నంలో పడ్డాడు.

నేత పనివారు చేనేతలో 'జకార్డ్ పద్ధతి'లో పని చేసేటపుడు జకార్డ్ పరికరం నుండి నేత యంత్రానికి వచ్చే వేలాది దారాలను పైకి, క్రిందకు కదపాలంటే చాలా శ్రమపడి పెడల్‌ను నొక్కాల్సి వుంటుంది. ఇలా నేసేటపుడు అనేక వేల సార్లు పెడల్‌ను బలంగా నొక్కాల్సి వుంటుంది. దీనితో చేసే వ్యక్తికి చాలా శారీరక శ్రమ, అలసట కలుగుతుంది. తరచూ విశ్రాంతి కోసం పని ఆపేయటంతో పనిలో నాణ్యత, ఉత్పత్తి కూడా తగ్గేది. ఈ శ్రమను తగ్గించటానికి నేత పనివారు ఆరోగ్యంగా, అలసి పోకుండా వుండటానికి, వారి ఉత్పత్తి, నాణ్యత పెంచటానికి రవి 2009లో జకార్డ్ యంత్రానికి అనుసంధానంగా, సులువుగా పెడలింగ్ చేసేందుకు ఒక పరికరాన్ని తయారు చేశాడు.

ఈ పరికరం ఏ జకార్డ్ మగ్గానికైనా సులువుగా అమర్చుకోవచ్చు. జకార్డ్‌ను సులభంగా పెడలింగ్ చేయటం కోసం ఒక సింగిల్ ఫేస్ మోటార్‌ను వాడటం జరిగింది. కాలక్రమేణా అనేక రకాల జకార్డ్ పరికరాలకి పనికి వచ్చేందుకు వీలుగా ఇతను అనేక అనుసంధాన యంత్రాలు కూడా కనిపెట్టాడు. వీటి ఖరీదు 15 నుండి 16 వేల రూపాయల వరకు వుంటుంది. 2009 నుండి ఇతను సుమారు 9000 పరికరాలు విక్రయించాడు. కొన్నవాళ్ళు అందరూ బావుందని చప్పినవారే.

చేనేతపై జకార్డ్ పని చేసే కళాకారుల శ్రమ తగ్గించటానికి రవి రూపొందించిన 'జకార్డ్ పెడలింగ్' యంత్రానికి ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో జరిపిన 10వ జాతీయ స్థాయి ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో రవిని రాష్ట్ర స్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.

**రాష్ట్రస్థాయి పురస్కారం - అసోం**

**కొత్తరకం తేయాకు డ్రయ్యర్**

**మరియు ఇతర యంత్రాలు**



పేరు : **దుర్లవ్ గోగి**

నివాసి : డిబ్రూగర్, అసోం.

ఒకవిధంగా చెప్పాలి అంటే 51 సంవత్సరాల డిబ్రూగర్ నివాసి దుర్లవ్ గోగి ఒక వరుస ఇన్నోవేటర్ అని చెప్పాలి. ఇన్నోవేషన్‌లు చెయ్యటమే వృత్తి, ప్రవృత్తిగా పెట్టుకొన్న వ్యక్తి. ఖాళీ సమయం దొరికినప్పుడు అస్సామీ భాషలో దేశభక్తి గేయాలు రచించి, సంగీత రూపకల్పన చేసి పాడుతూ వుంటాడు. ఈయన తేయాకుకు సంబంధించి చిన్నసైజు ఆవిరితో టీ చేసే పరికరం, డ్రమ్ము లాంటి తేయాకు డ్రయ్యర్, 'పుష్ – పుల్' తేయాకు డ్రయ్యర్, సెమీ ఆటోమేటిక్ తేయాకు డ్రయ్యర్, పసుపు కొమ్ములను ముక్కలు చేసే యంత్రం, తేయాకు కత్తిరించే యంత్రం లాంటి అనేక యంత్రాలను తయారు చేశాడు.

గోగి కి ఒక చిన్న స్వంత తేయాకు తోట ఉంది.





తొలుత ఇతను తన తేయాకును దగ్గరగా వున్న తేయాకు కర్మాగారాలకు విక్రయించేవాడు. ఈ పద్ధతిలో అతనికి నష్టం వచ్చేది. ఎందుకంటే ఒక గోనెసంచి పచ్చి తేయాకును ఫ్యాక్టరీ వారు సంచికి నాణ్యతను బట్టి రూ. 3 నుండి 8 రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. దాంతో ఇతను పచ్చి ఆకుగా అమ్మేకన్నా తేయాకు ఆకులను ఎండబెట్టి, ఎండిన టీ పౌడర్ ఆకును తానే స్వయంగా మార్కెట్‌లో అమ్మితే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చి, మార్కెట్‌లో లభించే ఒక తేయాకు ఎండబెట్టే యంత్రాన్ని కొనుగోలు చేశాడు. అది సరిగ్గా పని చెయ్యక పోవటంతో తానే ఒకటి తయారు చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. కొన్ని సంవత్సరాలు కష్టపడి ఎన్నిసార్లు విఫలమైనా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూ చివరికి తన మొదటి 'పుష్ & పుల్' పద్ధతిలో తేయాకును ఎండబెట్టే యంత్రాన్ని రూపొందించాడు.

ఈ యంత్రంలో అనేక ట్రేలలో పచ్చి తేయాకు నింపుకుని యంత్రానికి అందిస్తూ వుంటాడు, ఆ ట్రేలోని తేయాకు ఎండిన తర్వాత పైకి వస్తుంది. దాన్ని తీసి మళ్ళీ క్రింద పెట్టినట్లయితే రెండో ఆకుల ట్రే ఎండటానికి పైకి వస్తుంది. ఇలా ట్రేలను మారుస్తూ పోవటమే. ఇలా 14 ట్రేలు వున్న ఈ యంత్రంలో దాదాపు 20–30 కిలోల పచ్చి ఆకును వేస్తే కేవలం 40 నిమిషాలలో 6 కిలోల ఎండిన తేయాకు బయటకు వస్తుంది. ఈ యంత్రం ఉష్ణోగ్రతను 100 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు మార్చుకోవచ్చు. ఎల్.పి.జి. గ్యాస్‌తో పని చేసే తేయాకు హీటర్ ఖరీదు రూ. 2.5 లక్షలు. అదే కట్టెలు బయో మాస్ హీటర్‌తో పని చేసే డ్రయ్యర్ ఖరీదు రూ. 3 లక్షల వరకు వుంటుంది. ఇప్పటికే దుర్లవ్ ఎన్నో హీటర్లను తయారు చేసి విక్రయించాడు. కొన్నవారంతా బాగుందని ఇతరులకు సిఫారసు చేస్తున్నారు.

ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో జరిపిన 10వ జాతీయ స్థాయి ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో దుర్లవ్ గోగి చేసిన ఈ యంత్రానికి రాష్ట్ర స్థాయి పురస్కారంతో సత్కరించడం జరిగింది.

**రాష్ట్ర స్థాయి పురస్కారం - అసోం**

**'సీతల్ బిచోనా' చల్లని మంచం & తేయాకు మరియు ఇతర పదార్థాలు ఎండబెట్టే 'బెల్ట్ సిస్టం డ్రయ్యర్'**



పేరు : **సురేన్ బారువా**

నివాసి : తిన్‌సుకియా, అసోం.

అసోం రాష్ట్రంలోని తిన్ సుకియా ప్రాంతానికి చెందిన 51 సంవత్సరాల సురేన్ బారువా ఒక వరుస ఇన్నోవేటర్ అని చెప్పాలి. ఆయనకి స్వంతంగా 'టీ ఇంజనీరింగ్ వర్క్స్' అనే పేరున ఒక వెల్డింగ్ షాపు వుంది. దీంట్లో అతను 'బెల్ట్ సిస్టం డ్రయ్యర్', టీ రోలింగ్ టేబుల్, టీ స్టీమర్, శీతల్ బిచోనా (చల్లని మంచం), గదిని వెచ్చగా వుంచే యంత్రం మొదలైన ఎన్నో పరికరాలు తయారు చేశాడు. ఇతని ప్రత్యేకత చిన్న తేయాకు తోటల యజమానులకి పనికి వచ్చే అనేక ఎక్కువ ఖరీదు లేని యంత్రాలను రూపొందించటం.

**'శీతల్ బిచోనా' (చల్లని మంచం) :**

ఎండా కాలంలో వేడిగా వున్న పరిస్థితులలో చెమట కారుతూ వుంటే, ఉక్క పోస్తూ వుంటే నిద్ర పోవటం మాట





అటుంచి మామూలుగా జీవించడమే కష్టం. ఎయిర్ కండీషనర్లు వున్నా, అందరికీ వాటిని కొనుక్కునే స్థోమత వుండదు. ఇది గమనించిన బారువా అందరికీ అందుబాటులో వుండే ధరలో కూలింగ్ సదుపాయం అమర్చిన, పడుకోవటానికి సుఖంగా వుండే మంచాన్ని రూపొందించాడు. ఇది ప్రత్యేకించి మంచం మీదనే ఎక్కువ సమయం గడిపే వయసు మళ్ళిన వాళ్ళకు, రోగగ్రస్తులకు చాలా ఉపయోగ కరంగా వుంటుంది.

ఈ కూలింగ్ మంచం స్టీల్ బాక్స్ రూపంలో వుండి, దానిలో ఒక కరెంటు మోటారు, ఒక ఎయిర్ కంప్రెషర్ ఫ్యాన్, ఓల్టేజ్ రెగ్యులేటర్ మరియు చల్లని గాలి వెళ్ళటానికి మార్గమూ వుంటుంది. ఈ మార్గం ద్వారా చల్లని గాలి ప్రయాణించి, మంచం పైన పరిచిన సన్నని రంధ్రాలు గల రబ్బరు మ్యాట్ లోనుండి బైటకి వచ్చి పైన పరిచిన పరుపును చల్లబరుస్తుంది. మనకు కావలసిన ఉష్ణోగ్రతని ఓల్టేజ్ రెగ్యులేటర్ ద్వారా నియంత్రించుకోవచ్చు. ఈ మంచం ఖరీదు దాదాపు రూ. 20 వేల రూపాయలు వుంటుంది.

**తేయాకు ఆరబెట్టడానికి 'బెల్ట్ సిస్టం డ్రయ్యర్' :**

ప్రస్తుతం మార్కెట్‌లో లభించే తేయాకు డ్రయ్యర్లలో ట్రేలు ఇరుక్కుపోయి కదలక పోవటము, ఎక్కువ మరమ్మత్తులు రావటం తద్వారా ఉత్పత్తి ఖర్చు పెరగటం, ఎక్కువ కదలికలు వుండటము, ఎక్కువ చప్పుడు చెయ్యటము, కనీసం ఇద్దరు లేదా ముగ్గురు శిక్షణ పొందిన వ్యక్తులు వుండే కాని నడపలేక పోవటం లాంటి సమస్యలు వున్నాయి. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించటానికా అన్నట్లు సురేన్ బార్వా ఒక కొత్తరకం తేయాకు డ్రయ్యర్‌ను రూపొందించాడు.

ఈ డ్రయ్యర్‌లో కేవలం తేయాకు మాత్రమే కాక, ధాన్యం, అల్లం, పసుపు లాంటి అనేక రకాల తినే పదార్థాలను ఎండబెట్టడానికి కూడా వాడుకోవచ్చు. ఈ పరికరంలో మౌళికంగా వేడి విభాగం, ఎండబెట్టే విభాగం, శక్తిని అందజేసే విభాగం, కన్వేయర్‌ను నడిపే విభాగం లు వుంటాయి. మనం ఎండబెట్టాలి అనుకునే పదార్థాలని బెల్టుపైన అమర్చిన ట్రేలలో వుంచాలి. కన్వేయర్ ల పైన వున్న ట్రేలలోని పదార్థాలు ముందు వేడి చేసే భాగంలోకి, తర్వాత ఎండబెట్టే భాగంలోకి వెళ్ళటం ద్వారా ఇలా తిరిగే క్రమంలో అవి ఎండిపోతాయి. ఈ పరికరంలో వేడిని 200 డిగ్రీల వరకు పెంచుకోవచ్చు. ఇందులో బారువా మూడు రకాల యంత్రాలను తయారు చేశాడు. 1. టర్బో రకము, 2. ఎల్ ఆకారంలో వుండేది, 3. నేరుగా వుండేది. మనకు వున్న స్థలాన్ని బట్టి ఏ రకమైన యంత్రం అవసరమైతే దాన్ని కొనుక్కోవచ్చు.

ఈ యంత్రాల సామర్థ్యం 8 గంటలలో 150 నుండి 3,000 కిలోల పదార్థాలను ఎండబెట్టుకోవచ్చు. వీటి ధర రూ. 4.85 లక్షల నుండి 12 లక్షల వరకు వుంటుంది. ఇప్పటి వరకు ఈయన 35 యంత్రాలను అమ్మగా, అన్నీ సంతృప్తి కరంగా పనిచేస్తున్నాయి. ఈ యంత్రాలలో ప్రత్యేకత ఏమిటంటే, స్టెయిన్‌లెస్ స్టీల్ జాలీతో తయారు చేసిన ట్రేలు ఏ విధమైన శబ్దమూ, అరుగుదల లేకుండా సున్నితంగా తిరుగుతాయి. దీనితో అందులో పెట్టిన పదార్థాలు సమానంగా ఎండుతాయి.

కేవలం తేయాకునే కాక, అనేక ఆహార పదార్థాలను ఎండబెట్టే యంత్రాన్ని రూపొందించి, ఉత్పత్తిదారులకి సహాయ పడే యంత్రాలను రూపొందించిన సురేన్ బారువాకి ఎన్.ఐ.ఎఫ్. వారు 2019 సంవత్సరంలో నిర్వహించిన 10వ జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో రాష్ట్ర స్థాయి బహుమతినిచ్చి సత్కరించారు. ●


**పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం**

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.
'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన' అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# సాంప్రదాయ పోషక పదార్థాలకు కొత్త రూపు ఇచ్చిన

# తోకల శ్రీదేవి




- పల్లె వీరరాఘవ రెడ్డి

ఈ భూమిమీద మానవుడు పుట్టినప్పటి నుంచే అతని ఆహారమూ పుట్టింది. ఏది దొరికితే అది తినే దశ నుండి మారి, కాలక్రమేణా మనిషి ఏది తింటే తనకి మంచి చేస్తుంది? ఏది బలవర్ధక ఆహారము అన్న అన్వేషణ ప్రారంభించాడు. ప్రత్యేకించి భారతదేశంలో మన సాంప్రదాయ వైద్య జ్ఞానంలో ఈ బలవర్ధక, నాణ్యమైన ఆహారం గురించి విస్తృతంగా చర్చించబడింది. బహుశా ప్రపంచంలో ఈ రకమైన ప్రాచీన జ్ఞానం భారతదేశంలో తప్ప ఇంకెక్కడా లేదేమో! దానిలోనుంచి సామాన్యులకు అందుబాటులో వుండే శక్తినిచ్చే ఆహార రహస్యాలను శోధించి, వెలికి తీసి 'పల్లెస్పృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన మొట్టమొదటి మహిళా ఇన్నోవేటర్ తోకల శ్రీదేవి తన పరిశోధనను ఆపకుండా కొనసాగిస్తూ వివిధ వయస్సుల వారికి, పిల్లలకి, పెద్దలకి, పసివాళ్ళకి, స్త్రీలకి, వయోవృద్ధులకి, క్రీడాకారులకి సులభంగా, మనకు రోజూ లభించే పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని, శక్తిని ఇచ్చే పద్ధతులను శోధించి మనకి తెలుపుతునే వున్నారు. ఆవిడ పయనం వివరాలే ఈ కథనం.

ఈ సాంప్రదాయ జ్ఞానాన్ని గుర్తించి, దాన్ని ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తూ, వివిధ రకాల పోషకాలను తమ ఉత్పత్తుల ద్వారా ప్రతి ఒక్కరి అవసరానికి అనుగుణంగా తయారు చేస్తూ, మనకందించే ప్రయత్నాన్ని చేస్తూ, తద్వారా ఎంతోమంది గృహిణులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తున్న 'శ్రీదత్త న్యూట్రిషన్స్' సంస్థ పేరుతో మన ఇన్నోవేటర్, నిజామాబాద్ కు చెందిన "తోకల శ్రీదేవి". 2006లో సంస్థను స్థాపించి, గ్రామీణ సృజనాత్మకతకు అద్దం పట్టేలా పూర్తిగా సహజ సిద్ధమైన గ్రామీణ ఉత్పత్తులనే వాడుతూ శ్రీమతి శ్రీదేవి ఈ సంస్థను ముందుకు సాగిస్తున్నారు. వీరి ఈ ప్రయత్నానికి 'పల్లెస్పృజన' తమ తోడ్పాటును, సహకారాన్ని అందిస్తున్నాయి. వీరి ఉత్పత్తులను పరిశీలిస్తే.....

శిశువుల నుండి 10 సంవత్సరాల వయస్సు వుండే పిల్లలకు, వారికి అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలను విరివిగా అందించి, పోషణ, పెరుగుదలకు ఉపయుక్తమైన ఉత్పత్తులను అందిస్తోంది.

❀ యువతీ యువకులకు, క్రీడాకారులకు కావలసిన శక్తివంతమైన అదనపు పోషకాహారం (ఎనర్జీ ఫుడ్స్), తద్వారా తక్షణ శక్తి నిచ్చే ఉత్పత్తులు.

❀ వృద్ధులకు, వారి జీర్ణ వ్యవస్థకు అనుగుణమైన పోషణ అందించే ఉత్పత్తులు.

❀ మధుమేహం వున్న వారికి వారి శరీరంలో సరియైన గ్లూకోజ్ ఉండేటట్లుగా తయారు చేసిన ఉత్పత్తులు.

❀ దీర్ఘ రోగులకి వారి అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులు.

❀ గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

పై ఉత్పత్తులన్నీ 'సమృద్ధి ఫుడ్స్' పేరున శ్రీదత్త

న్యూట్రిషన్స్ సంస్థ అందిస్తున్నది. ఎంతోమంది గత పదిహేను సంవత్సరాలుగా పై ఉత్పత్తులను వాడుతూ ఎంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వారివారి అనుభవాలను అందరితో పంచుకుంటున్నారు కూడా. కొన్ని సంస్థలు వీటిని పూర్తి స్థాయిలో వాడుతున్నారంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. 'పల్లెసృజన' పాఠకులు వాడటమే కాక, వారి బంధు మిత్రులకు తెలుపమని కోరుతున్నారు ఇన్నోవేటర్ శ్రీదేవి. ఎన్నో పురస్కారాలు అందుకున్న ఇన్నోవేటర్ శ్రీదేవి తయారు చేసే ఉత్పత్తులను గురించి క్లుప్తంగా....

**చిన్న పిల్లల పోషకాహారం :**

ఈ ఆహారాన్ని 6 నెలల పిల్లల నుండి 5 సంవత్సరాల పిల్లల వరకు వాడవచ్చు. దీనిని బియ్యము, పెసర పప్పు, జొన్నలు, చక్కెరలు తగిన పాళ్ళలో కలిపి తయారు చేస్తారు.

**వాడే విధానము :**

30–50 గ్రా. పొడిని ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో కలిపి రోజుకు రెండుసార్లు తినిపించాలి. ఇది పిల్లల పౌష్టికాహారంగా ఉపయోగ పడుతుంది.






**ఎనర్జీ ఫుడ్ :**

ఇది డ్రై ఫ్రూట్స్, సేంద్రియ పద్ధతిలో పండించిన మొలకెత్తిన గింజలతో తయారు చేస్తారు. దీనిని అదనపు శక్తికోసం, రక్త వృద్ధి, రోగ నిరోధక శక్తి పెంచడము, తక్షణము అందించే శక్తి కోసం వాడవచ్చు. క్రీడాకారులకు, గర్భవతులకు, పాలిచ్చే స్త్రీలకు అదనపు ఉపయోగంగా పని చేస్తుంది. ఇందులో వాడిన పదార్థాలు రాగులు, మినుములు, జొన్నలు, కాజు, బాదము, పంచదార.

**వాడే విధానము :**

రోజుకు 2–3 సార్లు గ్లాసు నీటితో, పాలతో లేదా మజ్జిగతో 25 గ్రా పొడిని కలుపుకుని త్రాగాలి.

**మధుమేహము (షుగర్) వ్యాధి గ్రస్తులకు బలవర్ధక ఆహారము**

ఈ ఆహారాన్ని రాగులు, సజ్జలు, జొన్నలు, మినుములతో కలిపి తయారు చేస్తారు.

**వాడే విధానము :**

రోజుకు 1–2 సార్లు తీసుకోవాలి. 30 గ్రా. పొడిని 75 మి.లీ. నీటిలో లేదా మజ్జిగతో కాస్త ఉప్పు కలిపి తీసుకోవాలి. దీనిని ఉదయము అల్పాహారమునకు 40 నిమిషాలు ముందుగా తీసుకోవాలి. ఇది బ్లడ్ షుగర్‌ను, యూరిన్ షుగర్‌ను అదుపులో ఉంచుతుంది. అలాగే దీనిని ఇడ్లీ, దోస చేసే ముందు ఆ మిశ్రమంలో ఒక కిలోకు ఈ పొడిని 50 గ్రాములు కలుపుకొని చేసుకోవచ్చు.

**శరీరంలో వేడిని తగ్గించే ఆహారము :**

కొందరి శరీరంలో అధిక వేడి ఉత్పత్తి అవుతూ వుంటుంది. దానివల్ల కొన్ని రకాల వ్యాధులు సంక్రమించే అవకాశముంటుంది. శరీరంలోని అధిక వేడిని తగ్గించడానికి తయారు చేసిందే 'రాగి ఫుడ్'. ఇది శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. దీన్ని రోజుకు రెండుసార్లు 25–30 గ్రాముల పొడిని గ్లాసు నీటితో, పాలతో లేదా మజ్జిగతో కలిపి తీసుకోవాలి. ●

**ఇన్నోవేటర్ తోకల శ్రీదేవి ఫోన్ : 83091 19835**

# మీ సమస్యకు - పల్లెసృజన పరిష్కారం

గత సంచికలో 'మీ సమస్యలను తెలియజేయండి, వాటికి పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల పరిష్కారం 'పల్లెసృజన' ద్వారా మీకు అందిస్తాం' అన్న శీర్షికను ప్రారంభించగా పాఠకుల వద్ద నుండి సమస్యలు రావటం ప్రారంభమైంది. ఈ రెండు మాసాల్లో మాకు వచ్చిన సమస్యలలో రెండింటిని (ఎక్కువ మంది సమస్యగా భావించినవి) వాటికి 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు అందించిన పరిష్కారాలను ఇక్కడ తెలియజేస్తున్నాము.

**1. సమస్య(ప్రసాద్ గారు, కాకినాడ) :** మా ప్రాంతంలో పూత రేకుల తయారీ ఎక్కువగా వుంటుంది. ఈ పూత రేకులకు కేవలం కట్టెల పొయ్యి పైన మాత్రమే తయారు చెయ్యాలి. గ్యాస్ స్టౌలు లేదా కరెంటు స్టౌల పైన చేయటం కుదరదు, ఒకవేళ కుదిరినా వాటి నాణ్యత వేరుగా వుంటుంది. కట్టెల పొయ్యిపైన చేసినవి చాలా బాగుంటాయి. కానీ, వీటిని తయారు చేసే మహిళలకు కట్టెల పొయ్యి నుండి వెలువడే పొగ వల్ల వారు అనారోగ్యానికి గురవుతున్నారు. కాబట్టి పొగ రాకుండా మహిళలు ఆనందంగా పూత రేకులు తయారు చేసుకునే విధంగా 'పొగరాని పొయ్యి'లు ఏవైనా వుంటే తెలియజేయ గలరు.

**పరిష్కారం :** ఈ సమస్యకు పొగ రాకుండా చెయ్యటమే కాకుండా తక్కువ కట్టెలతో ఎక్కువ పూత రేకులు తయారు చేసుకునే పరిష్కారం వుంది. కట్టెల పొయ్యిని ఉపయోగించటం వల్ల మనం వండుకునే ఆహార పదార్థాల్లో కొన్ని మంచి గుణాలు కూడా చేరి మనిషికి ఆరోగ్యకరమైన ఆహారం తయారవుతుంది. హైదరాబాద్‌లో డా. సాయి భాస్కర్ గారు కట్టెల పొయ్యిల పైన చాలా రీసర్చ్ చేశారు. వివిధ రకాల వారికి అనుగుణంగా పొగరాని పొయ్యిలు ఎక్కడ, ఎలా లభిస్తాయో తెలియజేయ వలసిందిగా సాయి భాస్కర్ గారిని, సమస్యను తెలియజేసిన ప్రసాద్ గారితో సంధానం చెయ్యటం జరిగింది.

**2. సమస్య :** వరి పొలాల్లో గట్ల వెంట (గెనాలు అని కొన్నిచోట్ల పిలుస్తారు) కలుపు మొక్కలు ఎక్కువగా పెరిగి, వాటి ద్వారా కొన్ని చీడ పీడలు వరిని ఆశిస్తున్నాయి. వరి పొలాల్లో గట్లు చాలా చిన్నవిగా వుంటాయి, వాటికి ఇరువైపులా వరి మళ్ళలో నీరు, బురద వుంటుంది కాబట్టి గట్లపైన కలుపు తీయటం కష్టంగా వుంటోంది, ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం తెలియజేయ గలరని కొంతమంది రైతులు కోరారు.

**పరిష్కారం :** ఈ సమస్యకు 'పల్లెసృజన' ఇన్నోవేటర్ ముప్పారపు రాజు పరిష్కారాన్ని తయారు చేశాడు. ఇది ఒక కర్రలాగా వుంటుంది. దాని చివర వృత్తాకారంలో ఒక చక్రం వుంటుంది. బ్యాటరీతో పని చేసే ఈ పరికరం ద్వారా వరిమళ్ళ గట్లపైన వున్న గడ్డిని ఒక మనిషి నడుచుకుంటూ వెళ్ళి సులభంగా కత్తిరించవచ్చు. దీని ఖరీదు కూడా వెయ్యి రూపాయలకు లోపలే వుండే విధంగా ఇంకా కొన్ని మార్పు చేర్పులు జరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోగా ఈ పరికరం అందుబాటులోకి వస్తుంది. (ముప్పారపు రాజు ఫోన్ నెం. 789949623)

## ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (FPO) సభ్యులకు ఆహ్వానం

'పల్లెసృజన - క్రియేటివ్ మైండ్స్' **FPO** సభ్యుల కొరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "రైతుల కోసం రైతులు చేసిన గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ల పై సదస్సు" ను ప్రతి వారం నిర్వహించ బడుతున్నది. ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో వుండే యాంత్రిక పరిష్కారాలు, విత్తనాలు, మొక్కలు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, ఆయుర్వేద పురుగు మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానము..... ఇవన్నీ ప్రదర్శించబడతాయి. మీ సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు సాధించటానికి ప్రయత్నాలు జరుగుతాయి. కావున ఈ సదస్సులు ఎఫ్.పి.ఓ. సభ్యులు, రైతులు అందరూ ఆహ్వానితులే.

సదస్సుకు రావాలి అనుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు. కరోనా వైరస్ ప్రమాదం దృష్ట్యా కేవలం 30 మందికి మించకుండా పాల్గొన వచ్చు. మీరు మీ పేరు నమోదు చేసుకున్న తర్వాత మా తరుపున నిర్ధారించిన వారు మాత్రమే పాల్గొగనాల్సి వుంటుంది. అందరి సహకారాన్ని కోరుతున్నాం.

**సదస్సు నిర్వహించే స్థలము : 'పల్లెసృజన' కార్యాలయము, ప్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి, సికింద్రాబాద్. సమయం : ఉ. గం. 10-30 నుండి మ. 1-30 గం.ల వరకు.**

**వివరాలకు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

# 'పల్లెసృజన' పాల్గొన్న వివిధ కార్యక్రమాలు



జనవరి 9వ తేదీన
'విజ్ఞాన్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ' గుంటూరు జిల్లా
చేబ్రోలు లో నిర్వహించిన
ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్లపై అవగాహన
కార్యక్రమంలో 'పల్లెసృజన' మహిళా ఇన్నోవేటర్
శ్రీమతి దూబ రాజు గారిని
సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం,
చిత్రంలో బ్రిగేడియర్ గణేశం, ఇన్నోవేటర్ జలీల్
మరియు కళాశాల సిబ్బంది



'పల్లెసృజన' కార్యాలయంలో జనవరి 16న
'రైతుల ఇన్నోవేషన్ల సదస్సు,' కార్యక్రమం
నిర్వహించ బడింది. ఈ వర్క్‌షాప్‌లో
40 మందికి పైగా రైతులు పాల్గొని
ఇన్నోవేషన్లను గురించి
అవగాహన చేసుకున్నారు.



2020 డిశంబర్ 21వ తేదీన
'అక్షయ క్రిష్ణ పరివార్' బృందం
'పల్లెసృజన' ఇన్నోవేటర్ గోదాసు నర్శింహ
వర్క్‌షాప్‌ను అతని గ్రామం 'ముకుందాపురం'
లో సందర్శించినప్పటి చిత్రం.



'పల్లెసృజన' కార్యాలయంలో జనవరి 20న
2వ'రైతుల ఇన్నోవేషన్ల సదస్సు,' కార్యక్రమం
నిర్వహించ బడింది. ఈ వర్క్‌షాప్‌లో
30 మందికి పైగా రైతులు పాల్గొని
ఇన్నోవేషన్లను గురించి
అవగాహన చేసుకున్నారు.



'పల్లెసృజన' కార్యాలయంలో ఫిబ్రవరి 20 న
4వ 'రైతుల ఇన్నోవేషన్ల సదస్సు,'
కార్యక్రమం నిర్వహించ బడింది.
ఈ వర్క్‌షాప్‌లో
20 మందికి పైగా రైతులు పాల్గొని
ఇన్నోవేషన్లను గురించి
అవగాహన చేసుకున్నారు.



'పల్లెసృజన' కార్యాలయంలో ఫిబ్రవరి 6 న
3వ 'రైతుల ఇన్నోవేషన్ల సదస్సు,'
కార్యక్రమం నిర్వహించ బడింది.
ఈ వర్క్‌షాప్‌లో
20 మందికి పైగా రైతులు పాల్గొని
ఇన్నోవేషన్లను గురించి
అవగాహన చేసుకున్నారు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## విత్తనాలు నాటి ఎరువులు వేసే చేతి పరికరం

**సమస్య – పరిష్కారం :**

వ్యవసాయంలో విత్తనాలు వేయటమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనాలు నాటకపోతే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదముంది. దీనికి రైతులు వివిధ రకాల పద్ధతులను వాడుతూ వుంటారు. స్థితిమంతులైన రైతులు ట్రాక్టర్లు వాడినా, ఎక్కువ సంఖ్యలో వుండే పేద రైతులు చేతితో విత్తనాలు నాటడం కష్టమైన పనిగానే వుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో చేతులతో విత్తనాలు నాటడానికి మనిషి వంగి, చేతితో గుంత చేసి, విత్తనం వేసి మళ్ళీ మట్టిని పూడ్చవలసి వుంటుంది. మరలా రెండవ విత్తనం వేయటానికి ఇదే పద్ధతి అవలంభించాలి. ఇలా కొన్ని వేలు, లక్షల్లో విత్తనాలు వేయాల్సి వుంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని, ఇలా చేయటం వల్ల నడుం నొప్పితో చాలా ఇబ్బంది పడ్డ రైతులు, కూలీలు కూడా ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మనిషి వంగి పని చేయాల్సిన అవసరం లేకుండా, నిలబడే గుంత చేసి, విత్తనం వేసి, పూడ్చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు గుజరాత్‌కు చెందిన 'మన్సుక్ భాయ్ డిగాని'.

**పరికరం :**

ఈ పరికరం ఒక గొట్టం రూపంలో వుండి, క్రింది భాగంలో భూమిలోకి చొచ్చుకొని పోయే విధంగా మొనదేలి వుంటుంది. పై భాగంలో విత్తనాలు, ఎరువులు వేసుకోవటానికి అనువుగా ఒక పెట్టెను ఏర్పాటు చేసి వుంటుంది. ఈ గొట్టంలో స్ప్రింగు అమర్చబడిన ఒక ఇనుప కడ్డీ వుంటుంది. అది పైన ఏర్పాటు చేసిన ఒక లివర్‌ను నొక్కినపుడు విత్తనం డబ్బా తెరుచుకుని విత్తనం నేలలోకి దిగుతుంది, దాన్ని పైకి గుంజి కాలితో మట్టిని మూసివేస్తే సరిపోతుంది. ఇదేవిధంగా ఎరువును కూడా వేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- మనిషి వంగకుండా పని చేయటానికి వీలుగా ఉంటుంది.
- ఎంత లోతు అవసరమనుకుంటే అంత లోతుగా భూమిలోకి చొప్పించవచ్చు.



**ముఖ్యాంశాలు :**

- దీనితో పని చేయటం చాలా సులువు.
- సమయము, కూలీల ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.
- శారీరక శ్రమ చాలా తక్కువ.
- ఒకే రకంగా విత్తనం వేయటం వలన మొలక శాతం పెరిగే అవకాశముంటుంది.
- విత్తనాలు, ఎరువులు వృధా కావు.
- తక్కువ ఖర్చులో పనైపోతుంది.

## వివిధ పంటల నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

దేశంలో ఏ మూల వున్న రైతుకైనా ధాన్యం ఎక్కువగా నష్టపోకుండా, శుభ్రమైన గింజలను అందించే నూర్పిడి యంత్రం ఎంతో అవసరం. మార్కెట్లో రకరకాల నూర్పిడి యంత్రాలు అందుబాటులో వున్నా, ఒక్కో పంటకు ఒక్కో రకం యంత్రాలు ఉంటాయి. అవి కూడా ధాన్యం నష్టం ఎక్కువగా జరగకుండా నియంత్రించలేక పోవడమే కాదు, శుభ్రమైన ధాన్యాన్ని కూడా అందించలేవు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు దాదాపు అన్ని రకాల ధాన్యాలను నూర్పిడి చేసేందుకు ఒకే యంత్రం తయారు చేశారు రాజస్థాన్‌కు చెందిన 'మదన్‌లాల్ కుమావత్'. ఈ యంత్రం తక్కువ ధాన్యం నష్టంతో, ఎక్కువ శుభ్రమైన ధాన్యాన్ని రైతుకు అందిస్తుంది.

**పరికరం :**

మదన్‌లాల్ బజార్లో లభించే ఇతర నూర్పిడి యంత్రాలలో వుండే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూ, ఎక్కువ సామర్థ్యం కల అనేక రకాలైన పప్పుదినుసు పంటలు, ధాన్యాలే కాక, కొద్దిపాటి మార్పులతో వేరుశనగను కూడా నూర్పిడి చేసుకునే విధంగా దీన్ని రూపొందించాడు. దీనిలో నూర్పిడి చేసుకున్న తర్వాత తిరిగి ఏ రకమైన శుభ్రపరిచే ప్రక్రిత చేపట్టకుండానే నేరుగా మార్కెట్‌కు తరలించవచ్చు. ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడి చేసుకునేలా పరికరంలో మార్పు చేయాల్సిన సమయం కూడా పదిహేను నిమిషాలకు మించదు. ధాన్యపు గడ్డి లేదా చొప్పలను కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి ధాన్యంతో పాటు కాకుండా వేరే ద్వారం ద్వారా బయటకు పంపిస్తుంది యంత్రం.

**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రంలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి.
- ఒకటి ధాన్యపు గడ్డి, వగైరాలను చొప్పించేది, రెండవది వాటిని ముక్కలుగా చేసేది, మూడవది వృధాను, ధాన్యాన్ని వేరు చేసేవిగా భాగాలుంటాయి.





- ధాన్యాలు మార్పు చెందినపుడు వీటిలో మొదటి భాగంలో మాత్రమే ఆ ధాన్యానికి అనువైన గేరును మార్చాల్సి వుంటుంది.
- యంత్రం కొలతలు : పొడివు - 3.9 మీ., వెడల్పు - 1.9 మీ., ఎత్తు 2 మీటర్ల వరకుంటుంది.
- గేర్ బాక్స్ కలిగి వుంటుంది.
- మూడు డ్రమ్ముల్లో బ్లేడ్లతో కూడిన 3 చక్రాలు అమర్చబడి వుంటాయి.
- యంత్రం మొత్తం రెండు టైర్ల చట్రంపై అమర్చబడి వుంటుంది.
- ఈ యంత్రం సామర్థ్యం గంటకు - గోధుమలు : 18-25 క్వింటాళ్ళు, పప్పు ధాన్యాలు - 14-18 క్వి., బార్లీ : 25-30 క్వి., జొన్నలు - 18-22 క్వి., సోయాబీన్ - 15-20 క్వి., వేరుశనగ - 20-22 క్వి., మొక్కజొన్న - 8-10 క్వి. వరకు నూర్పిడి చేసుకోవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- 35 హార్స్‌పవర్‌ల ట్రాక్టర్‌కు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.
- అనేక పప్పు దినుసులే కాక, సజ్జలు, జొన్నలు, శనగలు, మెంతులు, బార్లీ, జీలకర్ర, మినుములు, ఆవాలు, సోయాబీన్, వేరుశనగ, పెసర, అలసంద మొదలైన ధాన్యాలను నూర్పిడి చేసుకోవచ్చు.
- వేరుశనగ నూర్పిడి చేయగల ఏకైక యంత్రం ఇది.
- ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడికి మార్పు చేయటం చాలా తేలిక, తక్కువ సమయం.
- కత్తిరించడం, నూర్పిడి చేయటం వరుసగా జరిగే యంత్రం.
- ఒక్కో పంటను ఒక్కోరకంగా యంత్రానికి అందించవలసి వుంటుంది.
- పంటను బట్టి యంత్రం లోని బ్లోయర్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
- నూర్పిడి సామర్థ్యం 99.6%, శుభ్రత సామర్థ్యం 99%, ధాన్యం నష్టం 0.25%, గింజలు పక్కలకు ఎగిరి పోవటం 0.36% లతో ఎంతో సమర్థవంతమైన యంత్రం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2001 జాతీయ పురస్కారం పొందింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని ఇన్నోవేషన్‌లను వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పుడు మీ సమస్యలను కూడా సేకరించి, వాటికి పరిష్కారాలు ఇన్నోవేటర్లతో చేయించాలని సంకల్పించింది. గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. **-ఎడిటర్.**

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**

## నిర్వహణా ఖర్చు లేని మహిపాల్ చారి

# ట్రాక్టర్‌కి అనుసంధానం చేసే 'క్రేన్'



- జె. శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా పర్కాల కు చెందిన "మహిపాల్ చారి" వీడర్ తయారీతో పల్లెసృజన పాఠకులకు చిర పరిచితుడే. అత్యంత స్వల్ప కాలంలోనే రైతు కూలీ నుండి తయారీదారుడిగా ఎదిగి, మంచి స్థాయిలో కొనసాగుతున్నాడు. తాను తయారు చేసిన 4, 5 హెచ్.పి. వీడర్లు ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా వేలాది మంది రైతులు వినియోగిస్తున్నారు. మహిపాల్ తయారు చేసిన మరో ఇన్నోవేషన్ గ్రామీణ ప్రజల అవసరాలను, ప్రస్తుతం ఎదుర్కొంటున్న కూలీల కొరత నుండి ఎంతో ఉపశమనం కలిగించడంతో పాటు, శ్రమను కూడా తగ్గించేదిగా తయారు చేశాడు.

ఇక ఇన్నోవేషన్ విషయానికి వస్తే, మహిపాల్ చారి తాను తయారు చేసిన వీడర్లను దాదాపు ప్రతి రోజూ ఎక్కడెక్కడికో రవాణా చేయాల్సి వుంటుంది. దాన్ని ట్రాన్స్‌పోర్ట్ వాహనంలోకి ఎక్కించాలంటే కనీసం ఐదారు మంది కూలీలు అవసరం. ఒక్కోసారి రవాణా వాహనం రాత్రి వేళల్లో వచ్చేది. అటువంటప్పుడు వీడర్‌ని లారీలోకి లోడ్ చెయ్యటానికి మనుషులు లభించక లారీని వెనక్కు పంపాల్సిన పరిస్థితి కూడా వచ్చేది. లేదా రాత్రంతా లారీని ఉంచుకోవాల్సి వచ్చి, దానికి అదనపు చార్జీ చెల్లించుకోవాల్సి వుండేది. అతనికి ఇది చాలా పెద్ద సమస్యగా మారింది. ఆ చిన్నపాటి యంత్రాన్ని (సుమారు ఒకటిన్నర క్వింటాళ్ళ బరువు) లారీలో లోడ్ చెయ్యడానికి క్రేన్ ఎక్కడి నుంచో పిలిపించాలన్నా కుదరదు. ఈ సమస్య పరిష్కారం ఎలా అని ఆలోచించి, తానే ఒక "మినీ క్రేన్"ను తయారు చేసుకున్నాడు. దీన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి దాదాపు 5 క్వింటాళ్ళ వరకు బరువును సులభంగా ఎత్తి లారీలో లోడ్ చెయ్యవచ్చు. అవసరం లేనప్పుడు దాన్ని సులభంగా తీసి పక్కన పెట్టుకోవచ్చు.

ఈ మినీ క్రేన్ పరికరాన్ని తనకోసం తయారు చేసుకున్నాను అనుకున్నాడు కానీ, దీనివల్ల రైతులకు, రైస్ మిల్లు లాంటి పరిశ్రమలకు, పొలంలో బోరు బావి నుండి మోటార్‌ను బైటకు తీయటానికి, లోపలికి దించడానికి, రైతులు ధాన్యం, పొలంలో గడ్డి మోపులు లాంటివి లోడ్ చేసుకోవడానికి ఇలా ఎన్నో రకాల సమస్యలను సులభంగా తీర్చగలదు అన్న విషయం అతను ఆలోచించనే లేదు. ప్రతి



ట్రాక్టర్‌కు హైడ్రాలిక్ వ్యవస్థ ఒకటి వుంటుంది. దాని ఆధారంగా ట్రాలీ అన్‌లోడ్ చెయ్యడానికి రైతులు ఉపయోగించుకుంటూ వుంటారు. దాని టెక్నాలజీతోనే ఈ మినీ క్రేన్ తయారైంది.

ఇప్పుడు గ్రామాల్లో ట్రాక్టర్ లేదా లారీలలో బరువైన వస్తువులు, ధాన్యం, పొలంలో వరిగడ్డి, జొన్న చొప్ప లాంటివి లోడ్ చెయ్యాలంటే ఎంతోమంది కూలీలు శ్రమకోర్చి చేసుకోవాల్సిన పరిస్థితి. కూలీల దొరకని పరిస్థితి రోజురోజుకూ తీవ్రతరం అవుతుందే తప్ప తగ్గడం లేదు. పని చేసేవారే కరువైపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ చిన్నపాటి పరికరం వల్ల గ్రామీణ ప్రాంతాల వారికి కోట్లాది రూపాయల ఖర్చు, శ్రమ మిగిలి పోతుంది అనటంలో ఎటువంటి సందేహం లేదు.

ఒక్కోసారి రైతులు తమ పొలంలో ట్రాక్టరుతో ఒకేరోజు రెండు మూడు రకాల పనులను చేసుకోవాల్సి వుంటుంది. అటువంటప్పుడు ఆ ట్రాక్టరు యొక్క రెండు మూడు రకాల పరికరాలను ఒకేసారి వెంట తీసుకు వెళ్ళాల్సి వుంటుంది. వాటిని ట్రాలీలో వేసుకుని లేదా ట్రాక్టరుకు గొర్రు లాంటి ఒక పరికరాన్ని తగిలించుకుని దాని పైన మిగతా నాగలి, ఇనుక చక్రాలు లాంటివి తీసుకు వెళ్ళాల్సి వుంటుంది. అలా తీసుకు వెళ్ళాలంటే భూమిపైన వున్న ఈ బరువైన పరకరాలను ఎత్తి ట్రాలీ లేదా ట్రాక్టరుకు తగిలించిన మరో పరికరంపైన పెట్టాలంటే ఆ బరువును మోసేంత మంది మనుషులు శారీరక కష్టంతో ఎత్తి పెట్టాల్సి వుంటుంది. సమయానికి వాటిని ఎత్తటానికి మనుషులు లేకపోతే సమయం వృధా అవుతుంది. అటువంటి సమయాల్లో ఈ క్రేన్‌తో కేవలం డ్రైవర్ వాటిని ఎత్తి పెట్టుకుని తీసుకు వెళ్ళటానికి చాలా అనుకూలం ఈ క్రేన్. దీన్ని ట్రాక్టరుకు అనుసంధానం చెయ్యటం, విడదీయటం కూడా చాలా సులభం.

రైతులకే కాదు, గోదాముల్లో ఎంతో ఎత్తులో ధాన్యపు మూటలను నెట్టుగా వేయటానికి ఎంతో మంది కూలీలు అవసరం లేకుండా దీనితో పని చేసుకోవచ్చు. 15 అడుగుల ఎత్తు వరకు ఒక క్వింటాలు బరువు వరకు సునాయాసంగా పైకి ఎత్తవచ్చు. ట్రాక్టరు లేదా లారీని లోడ్ చెయ్యటానికి 15 అడుగులకన్నా ఎక్కువ ఎత్తు అవసరం లేదు కాబట్టి ఇది చాలా అనువుగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రైతులకు చాలా సహాయ కారిగా వుంటుంది. ఏవైనా లారీలోకి లోడ్ చెయ్యాలంటే కనీసం 8–10 మంది అవసరం అవుతారు. కానీ ఈ పరికరం ద్వారా చెయ్యటానికి ఒక ట్రాక్టరు డ్రైవరు, క్రింద వస్తువును క్రేన్‌కు బెల్ట్‌ను బిగించే ఒక వ్యక్తి, ట్రాక్టరు లేదా లారీ పైన ఎత్తిన బరువును దించుకుని, క్రమ పద్ధతిలో పేర్చడానికి మరో వ్యక్తి వుంటే చాలు. ఒకవేళ ముగ్గురు లభించక పోయినా, ఇద్దరు వ్యక్తులైనా చాలు. ఒకరు ట్రాక్టరు డ్రైవర్ అయితే మరో వ్యక్తి క్రింద బరువును క్రేన్‌కు బెల్టు బిగించి అదే వ్యక్తి ఆ బరువుతో పాటు పైకి ఎక్కి దాన్ని దించుకో గలరు కూడా. ఈవిధంగా రైతులకు వేలాది రూపాయల కూలీల ఖర్చు మిగిలి పోతుంది. పైగా ఈ బరువులను ఎత్తటానికి దృఢమైన శరీర సౌష్టవం వున్నవారు మాత్రమే కావాల్సి వుంటుంది. కానీ ఈ మినీ క్రేన్‌తో పని చెయ్యటానికి పెద్దగా బలమైన వ్యక్తులు కాకపోయినా చేయగలరు.

ఈ మినీ క్రేన్‌తో కేవలం బరువులు ఎత్తటమే కాదు, రైతుల బోరు బావుల్లోని మోటార్‌కు ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని రిపేర్ చెయ్యటానికి బోరు బావిలోని



మోటార్‌ను పైకి తీయ్యాలంటే దాదాపు 10 అడుగుల పొడవు గల ఒక్కో పైపును పైకి లేవనెత్తుతూ, ఆ పైపులను విడదీసి, మోటార్ పైకి వచ్చిన తర్వాత దాన్ని రిపేర్ చేయించి, మళ్ళీ బోరు బావిలోకి దింపాల్సి వుంటుంది. ఇందుకు కూడా 6 నుండి 10 మంది వరకు కూలీలు అవసరం అవుతారు. ఇప్పుడు ఈ పరికరంతో కేవలం ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తులతో పని సులభంగా చేసుకోవచ్చు.

సాధారణంగా మిలటరీ, అగ్నిమాపక దళం వారు, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్, పోలీసు లేదా ప్రకృతి వైపరీత్యాలలో సహాయం చేసే వారి వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన జీపులు లేదా కొన్ని ప్రత్యేకమైన వాహనాలకు అనుసంధానించిన మినీ క్రేన్లను చూస్తుంటాం. కానీ అవేవీ రైతుకు పనికి రావు. ఇక్కడ రైతులకు అందుబాటులో వుండే ట్రాక్టర్‌కే క్రేన్ లాంటి పరికరాన్ని అనుసంధానించుకునేలా చేయటం ప్రత్యేకం. ఇప్పుడు అవసరమైనప్పుడు పైన చెప్పిన వాహనాలు రాని, రాలేని పరిస్థితుల్లో ఈ ట్రాక్టర్ క్రేన్ మనకి సహాయం చేస్తుంది. మార్కెట్లో కొన్ని మినీ క్రేన్‌లు లభ్యమవుతున్నా వాటి



ఖరీదు లక్షల్లో వుంటుంది. కానీ ఇది సామాన్య రైతుకు అందుబాటు ధరలోనే వుంటుంది.

మహిపాల్ చారి రూపొందించిన ఈ క్రేన్ ప్రతి గ్రామానికి ఒక్కటి వున్నా చాలు, ఆ గ్రామంలోని అందరు రైతులకు, గృహ నిర్మాణ దారులకు ఉపయోగ పడి, ఎంతో ధనాన్ని ఆదా చేస్తుంది. మినీ క్రేన్‌ను రూపొందించిన మహిపాల్ చారిని 'పల్లెసృజన' అభినందిస్తూ, దీన్ని ప్రతి గ్రామంకు చేరుకునే విస్తృత ప్రచారం కల్పించడానికి ప్రయత్నిస్తోంది. ●

**ఇన్నోవేటర్ మహిపాల్ చారి ఫోన్ నెం. 9866922168**

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



శ్రీతైలం

హైదరాబాద్ వచ్చినపుడు
'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే
మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
ఇ-మెయిల్ : boddu.subhash4@gmail.com
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన'
అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని **(ఫోన్ : 040-27111959)** సంప్రదించండి.

# 2020 లో 'పల్లెసృజన' కార్యక్రమాల్లో కొన్ని విశేషాలు

**మార్చి 2020 నుంచి 'కరోనా' ప్రభావం వల్ల పల్లెసృజన కార్యక్రమాలకు ఇబ్బంది కలిగింది. ఇందులో ప్రధానమైనది పల్లెసృజన ఇన్నోవేషన్లను రైతులకు పరిచయడం చేయడం, కొత్త ఆవిష్కరణలు వెతకడం లాంటి కార్యక్రమాలు కరోనా వల్ల సంపూర్తిగా చేయలేక పోయింది. అయినా 2 నెలల లాక్‌డౌన్ పీరియడ్ తీసివేస్తే మిగతా సమయమంతా పల్లెసృజన కార్యక్రమాలు నిరాఘాటంగా సాగాయి. ఈ సమయం లో పల్లెసృజన సాధించిన గమ్యాలలో ముఖ్యమైన వాటిని మీకు తెలియజేస్తున్నాం.**

**మూలికా వైద్యులకు ధృవీకరణ పత్రాలు:**

టి.డి.యు., బెంగుళూరు మరియు తెలంగాణ జీవ వైవిధ్య బోర్డ్‌ల సహకారంతో తెలంగాణకు చెందిన మూలికా వైద్యులకు ధృవీకరణ పత్రాలు అందించే ప్రయత్నం ప్రారంభించ బడింది. 100 మంది వైద్యులను తాత్కాలిక లక్ష్యంగా చేసుకోవడమైంది. అయితే కరోనా కారణంగా ఈ పని 2021వ సంవత్సరానికి వాయిదా పడింది.

**అధ్యాపకులకు వర్క్‌షాప్:**

ఈ సంవత్సరంలో పల్లెసృజన వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 100 మందికి పైగా అధ్యాపకుల కోసం ఒకరోజు వర్క్‌షాప్‌లు నిర్వహించడమైంది. దీని ప్రధాన ఉద్దేశ్యం విద్యాయర్థులను గ్రామాలతో అర్థవంతంగా సంధానం చేయడానికి, గ్రామ ప్రజలను గౌరవిస్తూ వారి జ్ఞానాన్ని తెలుసుకోవటానికి చర్చల ద్వారా వారి సమస్యలను కూలంకషంగా అర్థం చేసుకుని గ్రామ ప్రజల సహకారంతో వారి సమస్యలను పరిష్కారాలు వెతకడానికి అధ్యాపకులు చేయవలసిన నిర్దేశం ఈ వర్క్‌షాప్ లలో తెలియజేయబడింది.

**ఇన్నోవేటర్‌కు 'పద్మశ్రీ' పురస్కారం:**

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా మన రైతు ఇన్నోవేటర్ 'చింతల వెంకట్ రెడ్డి' గారికి 'పద్మశ్రీ' పురస్కారం రావటంతో పల్లెసృజన కుటుంబం ఎంతో ఆనందానికి గురయింది. 'మట్టి ఆధారిత వ్యవసాయం' అనే కొత్త ఆలోచనతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు మార్గదర్శకం చేస్తున్న వెంకట్ రెడ్డి గారికి భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని ఇవ్వటం ఎంతో సందర్భోచితంగా ఉంది.

**పల్లెసృజన కుటుంబ సభ్యుల సమావేశం:**

ఫిబ్రవరిలో రెండు రోజుల పాటు దాదాపు 100 మంది ఇన్నోవేటర్లు, వాలంటీర్లు మరియు శ్రేయోభిలాషులతో 'పల్లెసృజన కుటుంబ సమావేశం' నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పల్లెసృజన భవిష్యత్తు కార్యకలాపాలపై మేదోమథనం ఒకరోజు జరిగింది. ఇన్నోవేర్ల నుండి సేకరించిన ఉపయోగకరమైన సూచనలతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడమైనది.

**చిన్నశోధయాత్ర:**

కోవిడ్–19 కారణంగా సంవత్సరంలో నిర్వహించాల్సిన నాలుగు యాత్రలు రెండింటికే పరిమితం చేయడమైనది. ఫిబ్రవరిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 34వ చిన్నశోధయాత్ర మరియు డిసెంబర్‌లో మహబూబాబాద్ జిల్లాలో 35 యాత్ర నిర్వహించడమైనది. 100కు పైగా పాల్గొని యాత్రలను విజయవంతం చేశారు.

**ఆవిష్కరణల ప్రదర్శన:**

మార్చి నుండి జూన్ 2020 వరకు లాక్‌డౌన్ సమయం మినహా పునాది స్థాయి ఆవిష్కరణల ప్రదర్శన విస్తృతంగా జరిగింది. పల్లెసృజనలోని ఇన్నోవేషన్‌ల వితరణ కేంద్రం (ఐడిసి) జూలై నుండి సందర్శకులకు కోవిడ్–19 జాగ్రత్తలతో సదస్సులను నిర్వహించింది. వందలాది మంది రైతులు, విద్యార్థులు, అధ్యాపకులు, సేంద్రియ రైతులు, ఎన్జీఓలు, నాబార్డ్ బృందం, ఎఫ్.పి.ఓ.లు మొదలైన వారు పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించి ఆవిష్కరణల ప్రదర్శనను తిలకించారు. కళాశాలల్లో, టి.ఎస్.ఐ.సి. ఆధ్వర్యంలో కొన్ని జిల్లాల్లో ప్రదర్శనలు కూడా జరిగాయి. రైతులు, ఎఫ్‌పిఓలు, మహిళా రైతులు కోసం రైతు సదస్సు–2020 డిసెంబర్‌లో నెలకు రెండుసార్లు 1–3 శనివారాల్లో ప్రదర్శించ నిర్వహించబడుతున్నది.

**ఆంగ్లంలో 'పల్లెసృజన' ఇ-కాపీ :**

'పల్లెసృజన' పత్రికను పాఠకుల కోరికపై ఆంగ్లంలో ఇ–కాపీని తయారు చేసి, వెబ్‌సైట్‌లో పెట్టడం జరిగింది. ఈ సంవత్సరంలో వాలంటీర్లు పల్లెసృజన తెలుగు పత్రికలు రెండింటిని ఆంగ్లం లోకి అనువదించడం జరిగింది. ఈ పత్రిక www.pallesrujana.org లో పాఠకులకు అందుబాటులో వుంది.

**పల్లెసృజన కు రైతుల సందర్శన:**

ఆవిష్కరణలను చూడటానికి పెద్ద సంఖ్యలో రైతులు పల్లెసృజనను సందర్శించారు. వారిలో చాలామంది ఈ ఆవిష్కరణలకు ఆర్డర్లు కూడా ఇచ్చారు. హిమాచల్ ప్రదేశ్ నుండి ఇన్నోవేటర్ హరిమాన్ శర్మ అభివృద్ధి చేసిన ఆపిల్ మొక్కలు వేలాదిగా కొనుగోలు చేశారు. వారి సమస్యలకు సాధ్యమయ్యే పరిష్కారాల గురించి మరింత తెలుసుకోవడానికి ప్రతిరోజూ వందలాది మంది వాలంటీర్లను రైతులు ఫోన్లో సంప్రదిస్తున్నారు. రైతులు మరియు పల్లెసృజన మధ్య పరస్పర సహకారం 2019వ సంవత్సరంతో పోలిస్తే రెట్టింపు అయ్యింది.

**వెబినార్ల ద్వారా పంచుకోవడం:**

కోవిడ్ –19 కారణంగా జ్ఞాన ప్రసరణ ఆపొద్దన్న ఉద్దేశ్యంతో పల్లెసృజన ప్రతి బుధవారం రాత్రి 7–8 గంటల మధ్య వెబ్‌నార్లను నిర్వహించడం ప్రారంభించింది. మొట్టమొదటిసారిగా అలాంటి వెబ్‌నార్ 2020 అక్టోబర్‌లో నిర్వహించబడింది. వెబ్‌నార్లలో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతివారం వెబ్‌నార్లు కొనసాగుతున్నాయి.

**గ్రామీణ ఇంటర్న్‌షిప్:**

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎంవిఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, కెజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల, విజ్ఞాన ఫార్మసీ, విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మొదలైన 1500 మంది విద్యార్థులకు పల్లెసృజన వాలంటీర్లు ఆన్‌లైన్‌లో ఆగష్టు 20 నుండి జనవరి 21 వరకు గ్రామీణ ఇంటర్న్‌షిప్ నిర్వహించారు.

**నాబార్డ్‌తో పరస్పర అవగాహన:**

ఇది నాబార్డ్, తెలంగాణ మరియు పల్లెసృజన గొప్ప కలయిక. అనేక కార్యక్రమాలు పురోగతిలో ఉన్నాయి. తెలంగాణ లోని ఎఫ్‌పిఓల కోసం పల్లెసృజన పత్రిక సభ్యత్వం తీసుకోవటం జరిగింది. ప్రత్యేకంగా ఎఫ్‌పిఓ రైతుల కోసం రైతు సదస్సు పల్లెసృజనలో నెలకు ఒకసారి నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం పల్లెసృజనలో ప్రతినెలా 2వ శనివారం నిర్వహించబడుతుంది. నాబార్డ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని ఎఫ్.పి.ఓ.లు అందరూ 'పల్లెసృజన' పత్రిక సభ్యత్వాన్ని చేర్చడం జరిగింది.

**'పల్లెసృజన' పత్రిక:**

పల్లెసృజన పత్రిక సంవత్సరంలో మొత్తం ఆరు సంచికల ప్రచురణ ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగింది. కరోనా ఉన్నప్పటికీ, వాలంటీర్లు, స్కౌట్స్ మరియు సంపాదకీయ బృందం ఇంటినుండి పని చేసి దీనిని సాధ్యం చేశారు. వారికి మా కృతజ్ఞతలు. అందరు చందాదారులకు కూడా పంపడం జరిగింది. కష్ట కాలంలో వారి ఇళ్ళకు పంపిణీ చేసినందుకు పోస్టల్ సిబ్బందికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

**ఆవిష్కరణల అమ్మకం:**

2020 మొదటి త్రైమాసికంలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లోని అన్ని పునాది స్థాయి ఆవిష్కరణల మిశ్రమ అమ్మకాలు రూ. 5 కోట్లకు పైగా జరిగాయి. జూన్ నుండి సెప్టెంబర్ 2020 వరకు, మూడు కోట్ల విలువైన ఆవిష్కరణలను గ్రామీణ ఆవిష్కర్తలు విక్రయించారు. లాక్‌డౌన్ కాలంలో అధికారిక మార్కెట్ లేకపోవడం మరియు వ్యవసాయ కార్యకలాపాలు ఆగకపోవడమే ఈ విక్రయాలకు కారణమని అనుకుంటున్నాము అని పల్లెసృజన భావిస్తోంది. ప్రస్తుత సంవత్సరంలో అధిక అమ్మకాలు జరిగే అవకాశముండటం ఆసక్తికరమైన విషయం.

**ఇన్నోవేటర్లకు నిధుల సమీకరణ:**

పల్లెసృజన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో నిధుల మద్దతు కోసం ఉదార వ్యక్తులతో సంప్రదింపులు చరిపాం. దీని ఫలితంగా 12 మంది ఆవిష్కర్తలకు దాదాపు రూ. 18 లక్షల నిధుల మద్దతు లభించింది. ఈ మద్దతు ముఖ్యంగా గ్రాంటు మరియు వడ్డీ లేని రుణాల మిశ్రమంతో ఇవ్వటం జరిగింది.

**పురస్కారాలు:**

కోవిడ్–19 ఉన్నప్పటికీ 2020 సంవత్సరం చాలా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టింది. ముగ్గురు గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లు జాతీయ మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఇన్నోవేటర్ రైతు చిన్ని కృష్ణుడు (గంగారామ్)కు భారత ఉపరాష్ట్రపతి 'రైతు నేస్తం' పురస్కారం అందించారు. శ్రీమతి దూబ రాజు, శ్రీ శివ కుమార్ మోధాలకు అంతర్జాతీయ పురస్కారం అహమ్మదాబాద్ లోని 'సృష్టి' సంస్థ వారు అందజేశారు.

**పేటెంట్లు:**

ఈ సంవత్సరం ఎనిమిది పేటెంట్లను ఆవిష్కర్తలు అందుకున్నారు. ఈ వివరాలను పల్లెసృజన పత్రికల్లో ప్రచురించాము.

**ప్రధాన మంత్రి కార్యాలయం నుండి 'పల్లెసృజన'కు ఆహ్వానం:**

పల్లెసృజన వాలంటీర్లు చేసిన సూచనలను ప్రధానమంత్రి కార్యాలయం (పి.యం.ఓ.) అంగీకరించింది. ఆగస్టు 2020లో ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీ జితేందర్ సింగ్ తో వ్యక్తిగతంగా చర్చించమని 'పల్లెసృజన'కు ఆహ్వానం పంపించింది. చర్చల అనంతరం పల్లెసృజన సూచనలను అమలు పరుస్తామని మంత్రిగారు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ గుర్తింపుకి పల్లెసృజన వాలంటీర్లు అభినందనీయులు.

**జాతీయ బడ్జెట్ కోసం సూచనలు:**

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రజల నుండి బడ్జెట్ తయారీ కోసం సలహాలను కోరినప్పుడు పల్లెసృజన వాలంటీర్లు నవంబర్ 2020 లో 16 సూచనలను పంపారు. శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ మెయిల్ ద్వారా వ్యక్తిగతంగా 'పల్లెసృజన'కు కృతజ్ఞతలు తెలియజేశారు.


**గ్రామ స్వయం సమృద్ధి :**

పల్లెసృజన స్వచ్ఛంద సభ్యులు గ్రామ స్వయం సమృద్ధిపై ఒక కాన్సెప్ట్ పేపర్‌ను తయారు చేసి వివిధ సంస్థలు మరియు ప్రభుత్వ సంస్థలకు సమర్పించారు. ఈ భావనను అమలు చేయడంలో గ్రామస్తుల సుముఖతను పరిశీలించడానికి వాలంటీర్లు ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లా, కొన్ని గ్రామాలలో 40 రోజులకు పైగా గడిపారు. వారు గ్రామస్తుల నుండి అనుకూలమైన ప్రతిస్పందనతో తిరిగి వచ్చారు.

పిల్లలు తమ తెలివి తేటలతో బహుమతి గెలుచుకునే అవకాశం!

సృజనశీలురైన పిల్లలకి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి పేరున

# "ఇగ్నైటెడ్ మైండ్" పోటీలు



...... పిల్లలని మన ఉపదేశాలు వినే మర బొమ్మలుగా కాక స్వంత ఆలోచనలున్న వారిగా తీర్చి దిద్దండి.

**మీకు 19 సంవత్సరాలకన్న తక్కువ వయస్సు ఉండి దైనందిక సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతిక ఆలోచనలు ఉంటే వాటిని ignitedmind@honeybee.org ద్వారా వెంటనే మాకు పంపండి.**

మీ ఆలోచన పని చేస్తున్నది లేనిది నిరూపించే ఋజువు/ నమోనా మీవద్ద లేకపోయినా ఫరవాలేదు. ఉంటే బహుమతి గెలుచుకొనే అవకాశాలు మెరుగు పడతాయి. పిల్లల తల్లిదండ్రులకి, అధ్యాపకులకు ఒక విన్నపం. దయచేసి మీ ఆలోచనలు పిల్లల పేరున పంపకండి. మీకై ప్రత్యేకంగా వేరే పోటీలున్నాయి. వాటి వివరాలు HBNCRIIA@honeybee.org వెబ్ సైట్‌లో చూడవచ్చు.

పిల్లలు తమ స్వంత ఆలోచనలని ఎవరి సహాయం లేకుండా వారే పంపేవిధంగా ప్రోత్సహించండి.

SRISTI

Gian

www.csir.res.in www.sristi.org www.gian.org

హనీబీ నెట్‌వర్క్ క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డ్స్ (HBNCRIIA) 2020

# అంతర్జాతీయ బహుమతి పొందిన ఇద్దరు 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు

హనీబీ నెట్‌వర్క్ మరియు జియాన్ సంయుక్తంగా సృజనాత్మక & వినూత్న ఆలోచనలు లేదా సాంప్రదాయ జ్ఞాన పద్ధతుల కోసం మొదటి అంతర్జాతీయ వార్షిక పోటీని నిర్వహించాయి. ఇవి జంతువులు, పర్యావరణం లేదా మనతో సహా సమాజం ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పరిష్కరిస్తాయి. ఈ పురస్కారం ద్వారా పునాది స్థాయి ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ గుర్తింపు ఇవ్వడం ద్వారా సామాజిక అవసరాలను తీర్చడం దీని ప్రత్యేకత.

ఈ సంవత్సరం **87** దేశాల నుండి **2,500** ఎంట్రీలను సమీక్షించి ప్రముఖు, నిష్ణాతులచే వీటిని పరీక్షించిన తర్వాత నిపుణుల జ్యూరీ **11** మంది ఇన్నోవేటర్లను అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగింది. ఇందులో మన 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇద్దరు ఇన్నోవేటర్లు ఎంపిక కావడం జరిగింది. వారిని 'పల్లెసృజన' అభినందనలు తెలియజేస్తోంది.

**శ్రీమతి దూబ రాజు :**

విశాఖ పట్టణానికి చెందిన శ్రీమతి దూబ రాజు కూరగాయలు, కొన్ని రకాల మూలికలు, ఆకులను మేళవించి ఒక ద్రావణాన్ని తయారు చేసింది. లీటరు నీటిలో ఈ ద్రావణం 15–20 మి.లీ. కలిపి ఆ మిశ్రమంలో టమోటాలను ముంచి తీసిన తర్వాత గది వాతావరణంలో ఒక గోనె సంచీపైన ఆరబెట్టినా లేదా ఒక బుట్టలో వేసి ఉంచినా సరే కనీసం 25 రోజుల వరకు మనము ఎలాంటి స్థితిలో టమోట పండ్లను ద్రావణంలో ముంచి తీశామో అలాగే ఉంటాయి.

టమోటాలు మార్కెట్లో ఒక్కోసారి 50 రూపాయలు కిలో వుంటాయి, ఒక్కోసారి కేవలం 2 రూపాయల ధర మాత్రమే వుంటుంది. ఇలా చేయటం వల్ల టమోటాలను ఏమీ పాడవకుండా వున్న 25–30 రోజుల్లో ఎప్పుడు మార్కెట్‌లో ధర లభిస్తే అప్పుడు అమ్ముకోవటానికి రైతుకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

ఈ ద్రావణం తయారు చేసినందుకు గాను శ్రీమతి దూబ రాజుకు ఈ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఇవ్వడం జరిగింది.




**మోధా శివకుమార్ :**

120 సంవత్సరాల క్రితం చేనేత రంగంలో వెలుగులోకి వచ్చిన 'జాకార్డ్' అనే పద్ధతి నేటికీ కొనసాగుతునే వుంది. ఈ పద్ధతిలో ప్రపంచ వ్యాప్తంగా చీరలు నేస్తూనే వున్నారు. ఈ జాకార్డ్ ను ఉపయోగించి చీర నేయాలంటే మగ్గంపైన పని చేసే చేనేత కారుడు బాగా బలం కలిగి వుండాలి. ఎందుకంటే కాళ్ళక్రింద వున్న పెడల్‌లను ఎంతో బలంగా నొక్కాల్సి వుండటం చాలా కష్టమైన పని. అంతే కాదు ఈ జాకార్డ్ పద్ధతిలో ఒక చీర డిజైనింగ్ కొరకు 15 నుండి 50 వేల వరకు ఖర్చవుతుంది.

ఈ రెండు సమస్యలను తీర్చేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హిందూపురం నివాసి మోధా శివకుమార్ ఈ వ్యవస్థ మొత్తం ఎలక్ట్రానిక్ లో నిక్షిప్తం చేశాడు. ఇప్పుడు చీర నేత వేయాలంటే మగ్గంపైన మనిషి ఎక్కువగా కష్ట పడవలసిన అవసరం లేదు, చీర డిజైనింగ్ కేవలం ఒక ఫోటో తీసుకుని ఈ పరికరానికి పెన్ డ్రైవ్ ద్వారా అందిస్తే చాలు చీర అలాగే నేయబడుతుంది. డిజైన్ కొరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయవలసిన అవసరం లేదు.

చేనేత రంగంలో అతి సులభకరమైన పద్ధతి,కనిపెట్టడంతో పాటు, వేలాది రూపాయల ఖర్చును తగ్గించే ఈ పరికరం తయారు చేసినందుకు మోధా శివ కుమార్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఇవ్వడం జరిగింది.





## గల్లా చంద్రశేఖర్ - కారాకొల్లు వాసి ఇన్నోవేష్ ప్రయోగాల ఫలితం

# శ్రీతైలం తో మరిన్ని ఉపయోగాలు

- గత 10 సంవత్సరాలుగా శ్రీతైలం మీరు ఆదరిస్తున్నందుకు సంతోషం. ఇది నొప్పులకు (పెయిన్ రిలీఫ్ ఆయిల్) అద్భుతంగా పని చేస్తుంది. సాంప్రదాయకంగా నొప్పుల మందులలో వున్న పదార్థాతలేవీ శ్రీతైలంలో లేవు. ఇదే కకా శ్రీతైలం ఇంకా అనేక రకాలుగా ఉపయోగ పడుతుందనని చెప్పుటకు సంతోషిస్తున్నాము.
- ఇది మంచి యాంటీ బయాటిక్ అంటే ఇది దెబ్బలు, కురుపులు, చర్మ వ్యాధులు (సోరియాసిస్, బొల్లి తప్ప) మిగిలిన వాటికి అద్భుతంగా పని చేస్తుంది.
- ఫంగల్ వ్యాధులకు బాగా పని చేస్తుంది. పాచిన కాళ్ళకు, కాలి పగుళ్ళకు అద్భుతంగా పని చేస్తుంది. కానీ కట్టు కట్టరాదు. నీరు తగలరాదు.
- కొన్ని రకాల గడ్డలకు ఉదా.: లైఫోమ్ లాంటి వాటికి పని చేస్తుంది. రోజుకు రెండు, మూడుసార్లు రాయాలి.
- మొలలకు (పైల్స్) అద్భుతంగా పని చేస్తుంది. నొప్పి వున్న భాగంలో మందును పూయాలి.
- గోరుకు (నెయిల్) వచ్చే వ్యాధులన్నింటికి బాగా పని చేస్తుంది.
- అవాంఛిత రోమాలు అంటే హార్మోన్ల వల్ల వచ్చే వెంట్రుకలు ఉదా. స్త్రీల ముఖంపైన వచ్చే వెంట్రుకలను రాలిపోయేటట్లు చేస్తుంది. 40 రోజుల పాటు శ్రీతైలంను వెంట్రుకలపై రాయాలి.
- సోప్ అలర్జీలకు అద్భుతంగా పని చేస్తుంది.
- పక్షవాతం (పెరాలసిస్) వచ్చిన తర్వాత త్వరగా కోలుకోవాలంటే శ్రీతైలం అద్భుతంగా పని చేస్తుంది. రోజు శ్రీతైలంను పక్షవాతం వచ్చిన కాలుమీద లేదా చేయి పైన రాయాలి.





- స్పైడర్ మొలీసిస్/ బుల్లోసా అనే అరుదైన చర్మ వ్యాధి అంటే చర్మం బలహీనంగా వుండి, పగిలిపోతూ చీము పడుతుంటుంది. దీనికి అల్లోపతిలో సరైన వైద్యం లేదు. శ్రీతైలం ఈ వ్యాధిని తగ్గిస్తుంది. కానీ దీర్ఘకాలం వాడాలి.
- మెడిమ నొప్పితో బాధపడుతున్న వారు నొప్పి వున్నచోట పైపూతగా పూసుకున్నట్లయితే త్వరగా తగ్గిపోతుంది.
- నోటి పుండ్లకు కూడా శ్రీతైలం వాడవచ్చు (పుక్కిలించాలి).
- దీనిని శరీరానికి పూసుకుంటే దోమలు కుట్టవు. దీని ప్రభావం 4 గంటల వరకు వుంటుంది. శరీరానికి ఎలాంటి ప్రమాదం వుండదు. సురక్షితమైనది.
- చుండ్రు (డాండ్రఫ్) కు కూడా పని చేస్తుంది. చుండ్రు వున్నపుడు తలలో విపరీతమైన దురద పుడుతుంది. శ్రీతైలంను తలలో పట్టిస్తే దురద తగ్గిపోతుంది.
- పేలు (లైస్) వున్నపుడు శ్రీతైలంను తలకు పట్టిస్తే పేల సమస్య తొలగిపోతుంది. అయితే 2-3 రోజుల పాటు వరుసగా తలకు శ్రీతైలం రాసి 2 నుండి 3 గంటల తరువాత తలస్నానం చేయాలి. మరలా వారం తరువాత ఒకసారి ఇలా చేస్తే పేల సమస్య పోతుంది.

మేము గత పది సంవత్సరాల్లో చేసిన అనేక ప్రయోగాల ఫలితమే పైన వివరించిన శ్రీతైలం ఉపయోగాలు. కావలసిన వారు శ్రీతైలాన్ని ఉపయోగించి, వారి అనుభవాలను 'పల్లెసృజన'తో పంచుకుంటారని ఆశిస్తున్నాం. **- గల్లా చంద్రశేఖర్, 98495 41674**

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# పుదీన, తాటి ముంజల్లో ఔషధ గుణాలు



**శరీరంలోని బాధలను తీర్చే గుణాలు గల పుదీన :**

పుదీన ఆకు చూడటానికి సలక్షణంగా, మృదువుగా వుంటుంది. సంవత్సరం పొడవునా ఆకు పచ్చదనంతో వుంటుంది. ఈ ఆకు పూర్తిగా ఔషధ గుణాలు కలిగి వుంటుంది. జీర్ణ సంబంధిత వ్యాధుల ఔషధాల్లో దీనిని ఎక్కువగా వినియోగిస్తారు. పుదీనాలో చాలా ఔషధ గుణాలు వున్నయి కాబట్టి ఎన్నో రకాల సౌందర్య లేపనాల్లో, క్రిమి సంహారక మందుల్లో ఉపయోగిస్తూ వుంటారు. ఈ ఆకులో ఎటువంటి క్యాలరీలు వుండవు కాబట్టి ఎవ్వరైనా ఎంతైనా వాడవచ్చు. అందుకే ఇది చాలా విలువైన మొక్క.

కొద్దిగా పుదీన ఆకు రసం, అల్లం రసం, కొద్దిగా కలబంద గుజ్జు, యాలకులు, దాల్చిన చెక్క తీసుకుని అన్నిటినీ కలిపి మెత్తగా నూరి రోజు ఉదయం, సాయంత్రం ఒక చెంచాడు సేవించినట్లయితే ప్రేవుల్లోని మలినాలు అన్నీ పోతాయి. అరుగుదల శక్తి పెరుగుతుంది.

జీర్ణకోశ వ్యాధులు, కడుపులో నొప్పి వున్నవాళ్ళు పుదీన గింజలను నమిలి తినాలి.

గోరువెచ్చటి నీటిలో కొన్ని ఆకులను వేసుకుని కొద్దిగా వేడి చేసి త్రాగినట్లయితే కొద్దిగా జ్వరం వచ్చినట్లు అనిపిస్తున్న వారు, శరీరంలో బద్దకంగా (అనీజీగా) వున్న వాళ్ళకు వెంటనే ఉపశమనం కలుగుతుంది.

కామెర్ల రోగం వున్న వాళ్ళు కూడా పుదీన ఆకు రసం తీసుకున్నట్లయితే కామెర్లు తగ్గిపోతాయి.



కడుపులో మంట, ఛాతీలో మంట, మూత్ర సంబంధిత వ్యాధులు వున్నవారికి కూడా ఈ పుదీన ఆకు మరిగించి త్రాగటం వల్ల చాలా బాగా పని చేస్తుంది.

నెల తప్పిన ఆడవారికి కొందరికి వాంతులు, విరోచనాలు, కడుపులో మంట, వికారాలు లాంటి లక్షణాలు వున్నట్లయితే అటువంటి వారు పుదీన ఆకు రసంలో కొద్దిగా నిమ్మరసం, కొద్దిగా తేనె వేసుకుని కలిపి చేతిలో వేసుకుని నాకినట్లయితే ఈ లక్షణాలన్నిటి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇలా రోజుకు రెండుసార్లు చేసినట్లయితే ఈ సమస్యల నుండి బైట పడవచ్చు.

కొంత మందికి ముక్కుల్లో, చెవుల్లో ఇన్‌ఫెక్షన్ వస్తూ వుంటుంది. అటువంటి వారు చెవిలో సమస్య వున్నవారు చెవిలో, ముక్కు సమస్య వున్న వారు ముక్కులో రెండు మూడు చుక్కల పుదీనా రసం వేసుకున్నట్లయితే ఆ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

పుదీన ఆకులు బాగా ఎండబెట్టి, పొడి చేసుకుని అందులో సైంధవ లవణం కొద్దిగా కలుపుకుని పళ్ళ పొడలాగా వాడినట్లయితే నోటికి సంబంధించిన వ్యాధులు అయిన చిగుళ్ళ నొప్పి, పంటి నొప్పులు, నోటి దుర్వాసన, చిగుళ్ళ వాపులు, చిగుళ్ళలో రక్తం రావటం లాంటి సమస్యలనీ తొలగిపోతాయి.

ఎవరికైనా వంటిమీద ఏదైనా అలర్జీ వల్ల దద్దుర్లు వస్తున్నట్లయితే కొన్ని పుదీన ఆకులను ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరిగించి, అందులో కొద్దిగా పటిక బెల్లం కలుపుకొని త్రాగినట్లయితే ఈ ద్రావణం మంచి టానిక్ లాగా పని చేసి ఆ దురదలు, దద్దుర్లు తగ్గిపోతాయి.

మొహం పైన నల్ల మచ్చలు, మొటిమలు వున్న వారు పుదీన ఆకును రసం పిండుకుని ముఖానికి పూసుకుని ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే కొద్ది రోజుల్లో నల్ల మచ్చలు, మొటిమలు మానిపోతాయి.

సిగరెట్, ఆల్కాహాలు, గుట్కా అలవాటు వున్న వారు



ఇంట్లో కుండీల్లో పుదీనా పెంచుకొని, రెండు పుదీన ఆకులు, రెండు తులసి ఆకులు ప్రతిరోజూ తీసుకున్నట్లయితే వాటి ద్వారా శరీరంలో పేరుకు పోయే నికోటిన్ లాంటి చెడు అవశేషాలు అన్నీ శరీరం నుండి తొలగించ బడతాయి. శరీరంలోని ఇలాంటి మలినాలను తీసివేసే శక్తి ఈ రెండింటికి మాత్రమే వుంది అనటం అతిశయోక్తి కాదు.

**మేటి వృక్షాలను తలదన్నే సాటిలేని వృక్షం 'ఆంధ్ర కల్పవృక్షం' తాటిచెట్టు:**

సాధారణంగా తాటిచెట్టు క్రింద పాలు త్రాగుతున్నా సరే 'తాటి కల్లు త్రాగుతున్నాడు' అని మన తెలుగు సామెత ఒకటి వుంది. అలా సామెత వుంది కదా అని తాటి చెట్టును అంత సులభంగా తీసివేయకూడదు. ఇందులో ప్రతిదీ మన అవసరాలకు ఉపయోగ పడేదే. తాటి ఆకులతో గ్రామాల్లో గుడిసెల పైకప్పుగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం పట్టణాల్లో కూడా కేవలం తాటి దూలాలు, దెంతెలు, ఆకులతో అధునాతనమైన కొట్టాలు నిర్మిస్తున్నారు. దానికి కారణం ఇందులో చలికాలం, వర్షా కాలంలో వెచ్చదనం, ఎండా కాలం చల్లదనంతో ఉంటుంది. శరీరానికి ఎంతో ఆరోగ్యకరమైనది. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. పూర్వం నుండి ఇప్పటికీ భద్రాచలం పుణ్య క్షేత్రంలో ఇప్పటికీ శ్రీరాముల వారి పెళ్ళి పందిరి తాటి ఆకులతోనే వేస్తారు. అంతటి ప్రశస్తమైనది తాటిచెట్టు. కాగితం పుట్టక ముందు మన పూర్వ కవులు ఈ తాటి ఆకులపైనే ఎన్నో గ్రంథాలు వ్రాసారు. తాటి ఆకులను పసుపు నీటిలో నానబెట్టి బాగా ఎండిన తర్వాత వాటిపైన వ్రాసిన గ్రంథాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా వున్నాయి.

తాటి నుంజలు తిన్నట్లయితే శరీరం సమ శీతోష్ణంతో వుండేలా చేస్తుంది, జీర్ణ శక్తిని వృద్ధి చేస్తుంది. ఆస్తమా వున్న వారికి కూడా ఇవి చాలా బాగా పని చేస్తాయి.

తాటి కల్లు/ నీర కొద్దిగా తీసుకుంటే శరీరానికి ఔషధంలా పని చేస్తుంది. ఎక్కువ తీసుకున్నట్లయితే మత్తు మందులా పని చేస్తుంది. దీన్ని రోజూ ఒక టానిక్‌లా వాడగలిగితే ఇందులో వున్నన్ని ఔషధ గుణాలు ఎందులోనూ లేవు. ఈ నీరలో ప్రొటీన్లు వున్నాయి, చక్కెర వుంది, ఐరన్, పాస్పరస్, క్యాల్షియం, ఆస్పరిక్ యాసిడ్, హిమోగ్లోబిన్, నికోటిన్ ఇలా ఎన్నో గుణాలు ఇందులో దాగున్నాయి. అయితే దీన్ని తక్కువ డోస్‌లో టానిక్ లాగా వాడితే ఇవన్నీ శరీరంపైన పని చేస్తాయి. ఎక్కువ తీసుకుంటే శరీరాన్ని గుల్ల చేస్తాయి.

తాటి ముంజల్లో కూడా చాలా ఔషధ గుణాలు కలిగి వున్నాయి. అయితే చాలామంది వాటిపైన వున్న తొక్క తీసేసి తింటుంటారు. ఎందుకంటే అది కొద్దిగా చేదు గుణం కలిగి వుంటుంది. అయితే ఆ తోలుతో సహా తినగలిగితే శరీరానికి ఎంతో ఉపయోగ కరంగా వుంటుంది. కడుపులో నులి పురుగులను కూడా చంపేస్తుంది. మంచి ఆయుర్వేదం మందులా పని చేస్తుంది.

తాటి బెల్లం కూడా చాలా ఔషధ గుణాలు కలిగి వుంటుంది. అయితే దీన్ని కూడా ఆహార పదార్థాల్లో తగినంత వేసుకుని తింటే చాలా రకాలుగా శరీరానికి మేలు చేస్తుంది. సమశీతోష్ణంగా పని చేసే గుణం వుంది కాబట్టి మన శరీరానికి ఇది చాలా ఉపయోగకరమైనది.

తాటి ముంజ పండు అయిన తర్వాత దాన్ని కాల్చుకుని తిన్నా కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అలాగే తాటి ముంజలు పండిన తర్వాత భూమిలో నాటితే రెండు మూడు తాటి ఆకులు పైకి కనిపిస్తాయి, దాన్ని పీకితే లోపల పొడవాటి క్యారట్ లాగా వుంటుంది వీటిని 'తేగలు' అంటారు. ఇవి కూడా శరీరానికి ఎంతో మంచి చేస్తాయి. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయష్కరం.

**'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854**

## 'పల్లెసృజన' పట్ల చీరాల పోస్ట్‌మెన్ 'రామశేషయ్య' అభిమానం

బ్రిగేడియర్ గణేశం గారికి,

నా పేరు 'రామ శేషయ్య'. నేను పోస్ట్‌మేన్‌గా పని చేసి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నాను. రిటైరైనా ఇంట్లో ఉండలేక దాదాపు ప్రతిరోజూ పోస్టాఫీసుకు వెళ్ళి అక్కడ అవసరమనుకున్న చోట నా సహాయ సహకారాలు అందిస్తూ వుంటాను. మనిషి ఖాళీగా వుండకూడదు, ఏదో ఒక మంచి పని చేస్తూ వుంటాలి అని ఊపాధ్యాయుడుగా పని చేసిన మా నాన్నగారి వద్ద నేను నేర్చుకున్నాను. ఇలా చేస్తున్నపుడు మా పోస్టాఫీసుకు 'పల్లెసృజన' పత్రిక వచ్చింది. దానిపైన చిరునామా మా పోస్ట్‌మేన్ కనుగొనలేక మళ్ళీ పోస్టాఫీసులో పెట్టడం జరిగింది. పుస్తకం బాగా కనపడటంతో నేను చదువుదాం అని పత్రికను తెరవగా, ప్రతి పేజీ ఎంతో ఆసక్తిగా, ఉపయోగ కరంగా కనిపించింది. ఇటువంటి పుస్తకాన్ని చందా ద్వారా తెప్పించుకుంటున్న వ్యక్తి గుణం మంచిదై వుంటుంది. ఇటువంటి పుస్తకం తప్పక అతనికి చేరాలి అని మీకు ఫోన్ చేసి, అతని ఫోన్ నంబర్ మీ ద్వారా తెలుసుకుని, మొత్తానికి పుస్తకాన్ని సదరు చందాదారునికి అందజేయడం జరిగింది. ఈ పనంతా చేసినందుకు నాకు ఎంతో సంతోషంగా వుంది.

**– రామ శేషయ్య, చీరాల. ఫోన్ : 9014339485**

రామ శేషయ్య గారు,

మీలాంటి వాళ్ళు 'పల్లెసృజన' పత్రికను చూడటం వల్ల మేము చేస్తున్న కృషి విలువ తెలిసింది. మా చందాదారునికి పత్రిక క్షేమంగా చేరేలా చేసిన మీ మంచితనానికి ధన్యవాదములు. మీలాంటి వాళ్ళ సహకారమే మమ్మల్ని ఇంకా మంచి పనులు చేసేలా కార్యోన్ముఖులను చేస్తుందని సవినయంగా తెలియజేసుకుంటున్నాము.

**– బ్రిగేడియర్ గణేశం.**


### FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,**<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## వాడిన కేబుల్ నుంచి తీగను తీసే యంత్రం



వ్యర్థంగా పడివున్న వైర్లలోనుండి లోహపు తీగలను వేరుచేసి విక్రయించుకునే వ్యాపారులకు ఆ తీగలను తీసేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన తీగలను వెలికి తీసేందుకు అత్యంత అనువైనది ఈ యంత్రం. కూలీల ఆదాతో పాటు అధిక ఆదాయాన్ని కూడా సమకూరుస్తుంది. వైర్లను కాల్చటం వల్ల ఏర్పడే వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుతుంది.

## ఇసుక జల్లి పట్టే యంత్రం



ప్రస్తుతం ప్రతి రైతు, ప్రతి గృహ నిర్మాణదారుడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 'కూలీలు'. ఈ సమస్య వల్ల ప్రతి ఒక్కరూ నష్ట పోవడంతో పాటు, పనులు సాగక సతమతం అవుతున్నారు. గృహ నిర్మాణంలో ప్రధానంగా సిమెంటు చేయటానికి సన్నటి ఇసుక అవసరం. ఇందుకోసం నిర్మాణదారులు కూలీలతో ఇసుకను జల్లి పట్టించడం జరుగుతుంది. ఈ సమస్యను సులభతరం చేసేందుకు ఒక చిన్న యంత్రాన్ని తయారు చేశాడు ఇన్నోవేటర్ జలీల్. కేవలం ఇద్దరు వ్యక్తులు ఈ యంత్రానికి ఇసుక అందిస్తూ వుంటే చాలు ఇసుక దానంతట అదే జల్లి పడుతుంది.

## టమోటాలను నిలువ చేసే ద్రావణం




ఇది కూరగాయలు, కొన్ని రకాల మూలికలు, ఆకులను మేళవించి ఒక ద్రావణం. లీటరు నీటిలో ఈ ద్రావణం 15-20 మి.లీ. కలిపి ఆ మిశ్రమంలో టమోటాలను ముంచి తీసిన తర్వాత గది వాతావరణంలో ఒక గోనె సంచీపైన ఆరబెట్టినా లేదా ఒక బుట్టలో వేసి ఉంచినా సరే కనీసం 25 రోజుల వరకు మనము ఎలాంటి స్థితిలో టమోట పండ్లను ద్రావణంలో ముంచి తీశామో అలాగే ఉంటాయి. టమోటాలు మార్కెట్లో ఒక్కోసారి 50 రూపాయలు కిలో వుంటాయి, ఒక్కోసారి కేవలం 2 రూపాయల ధర మాత్రమే వుంటుంది. ఇలా చేయటం వల్ల టమోటాలను ఏమీ పాడవకుండా వున్న 25-30 రోజుల్లో ఎప్పుడు మార్కెట్లో ధర లభిస్తే అప్పుడు అమ్ముకోవటానికి రైతుకు ఎంతగానో ఉపయోగ పడుతుంది.

## కొబ్బరి చెట్లను ఎక్కే పరికరం



కొబ్బరి చెట్లను ఎక్కడం అందరికీ చేతకాదు. దానికో ప్రత్యేక శిక్షణ, ధైర్యం కలిగిన వ్యక్తులు అవసరం. అందుకే ఎవ్వరైనా సరే చెట్టు ఎక్కేలా, ఎక్కిన తర్వాత అక్కడ కూర్చుని పనిచేసుకునేలా రూపొందించిన ఈ పరికరంతో కొబ్బరి చెట్లను సులభంగా ఎక్కి చెట్టుపైన వున్న పంటను దానిపైనే కూర్చుని కోసుకోవచ్చు.

పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :
పి. వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/ 7989038186
బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly January - February 2021 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**




పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

**Pay by "Phone Pe" to 9866 00 1678**

PhonePe

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం |
|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org
లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

లేదా

'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

**QR code for Phone Pe**
Scan & Pay Using PhonePe App